

ముంచేసిన మొంథా

మొంథా తుఫాన్ జిల్లా రైతాంగాన్ని ముంచేసింది. కష్టజీవుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. ఇప్పటికే అధిక వర్షాలతో సుమారుగా రూ.2వేల కోట్లకు పైగా విలువైన పత్తి దిగుబడులు రైతులు కోల్పోయారు. తాజాగా మొంథా రూపంలో మరో ముప్పు వచ్చిపడింది. పత్తి సహా కంది, వరి, మిరప, పప్పుశనగ పంటలు తీవ్రంగా దెబ్బతింటాయని, అపార నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని రైతులు బెంబేలెత్తి పోతున్నారు. తుఫాన్ దెబ్బకు కందనవోలు పశ్చిమ ప్రాంతం కరువు రైతులు నిలువునా మునిగే పరిస్థితి నెలకొంది. జిల్లాపై మొంథా తుఫాన్ తీవ్ర ప్రభావం ఉండకపోవచ్చని వాతావరణ శాఖ నిపుణులు అంటున్నా ఎలాంటి పరిస్థితులు తలెత్తినా ఎదుర్కోవడానికి కలెక్టర్ ఏ. సిరి జిల్లా యంత్రాంగాన్ని సన్నద్ధం చేశారు.



కోసిగి మండలం సాతనూరులో నేలపాలైన వరి పైరు

- జిల్లా అంతటా తుఫాన్ ప్రభావం
- ముసురుకున్న పల్లెసీమలు
- పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షాలు
- మిరప, కంది, వరి పంటలపై ప్రభావం
- 2వేల ఎకరాల్లో నేలవాలిన వరి పైరు
- బెంబేలెత్తిపోతున్న రైతాంగం
- 295.2 మిల్లీ మీటర్ల వర్షపాతం
- అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం

కర్నూలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముంచుకొస్తున్న 'మొంథా తుఫాన్' అన్నదాతల నెత్తిన పిడుగులా పడబోతుంది. జిల్లాలో 26 మండలాల్లో సాధారణ సాగు విస్తీర్ణం 4.22 లక్షల హెక్టార్లు కాగా 2025-26 ఖరీఫ్‌లో 4.25 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగుచేశారు. అత్యధికంగా 2.25 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేశారు. కంది, వరి, మిరప, టమోటా, మొక్కజొన్న, సజ్జ పంటలు సాగు చేశారు. సగటున ఎకరాకు రూ.50 వేలు ప్రకారం హెక్టారుకు రూ.1.25 లక్షలు సాగు ఖర్చు చేశారు. ఈలెక్కన రూ.5,315 కోట్లకు పైగా పెట్టుబడి రూపంలో కష్టజీవులు మట్టిలో పోశారు. దిగుబడులు చేతికొచ్చే సమయంలో భారీవర్షాలు నిలువునా ముంచేశాయి. ఇప్పటికే పత్తి రైతులు రూ.2 వేల కోట్లకు పైగా విలువైన పత్తి దిగుబడులు రైతులు కోల్పోయారు. పెట్టుబడి అప్పులు తీర్చేందుకు సుగ్గిబాటన జిల్లా సరిహద్దులు దాటేందుకు సన్నద్ధమవుతున్నారు. వేలాది కుటుంబాలు తెలంగాణ, గుంటూరు ప్రాంతాలకు వలస వెళ్లారు.

నేలపాలైన వరి

'మొంథా' ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కోసిగి మండలం తుమ్మిగనూరు, సాతనూరు, కందుకూరు, కడదొడ్డి, అగసనూరు గ్రామాల్లో దాదాపుగా 2వేల ఎకరాలకు పైగా వరి పైరు నేల వాలింది. త్వరలో కోతలకు సిద్ధమవుతుండగా మొంథా తుఫాన్ నిలువున ముంచేసింది. చేతికొచ్చిన పంట నేలపావడంతో గింజలు మొలకెత్తి దిగుబడి సగానికి పైగానే నష్టపోతామని రైతులు వాపోతున్నారు. కోసిగి మండలంలో ఒక్కటే కాదు. తుంగభద్ర తీరంలో మంత్రాలయం, నందవరం, సి.బెళగల్, కర్నూలు రూరల్ మండలాలు, తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ) కింద వరి సాగుచేసిన హాలహర్వి, హోళగుంద, ఆదోని, కౌతాళం, పెద్దకడుబూరు, ఎమ్మిగనూరు, గోనేగండ్ల మండలాల్లో వరి రైతులు మొంథా తుఫాన్‌కు తీవ్ర నష్టాన్ని చవి చూడాల్సి వస్తుంది. ఈఏడాది 12,500 హెక్టార్లలో వరి ధాన్యం పంటను సాగుచేశారు. తుఫాన్ ప్రభావంతో త్రీవంగా నష్టపోతామని రైతులు ఏకరువు పెడుతున్నారు.

ఎంత కష్టం.. ఎంత నష్టం

కర్నూలు అగ్రికల్చర్: జిల్లాలో మొంథా కకావికలం కొనసాగుతోంది. సాధారణ సాగు విస్తీర్ణం 4,22,540 హెక్టార్లు కాగా, సెప్టెంబరు ఆఖరు నాటికి రూ.3,46,495 (82 శాతం) హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. 2,19,636 హెక్టార్లలో పత్తి సాగైంది. వరి 9,120 హెక్టార్లు, సజ్జ 5,749 హెక్టార్లు, మొక్కజొన్న 7,201 హెక్టార్లు, కొర్ర 2858 హెక్టార్లు, కంది 39,531 హెక్టార్లు, వేరుశనగ 28,453 హెక్టార్లు, ఆముదం 9,306 హెక్టార్లు, ఉల్లి 11,056 హెక్టార్లు, ఇతర పంటలు 23,486 హెక్టార్లు తదితర అన్ని పంటలు కలిపి 3,46,495 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ప్రధానంగా పత్తి రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది. ఈసారి ముందస్తు వర్షాలతో మే చివరి వారంలోనే పత్తిని రైతులు సాగు చేశారు. తక్కువ వ్యవధిలోనే పత్తి చేతికందుతుందని, మంచి ధరకు అమ్ముకుందామని రైతులు ఆశించారు. అయితే రోజూ కురుస్తున్న వానలతో తెగుళ్ల, క్రిమికీటకాలు రైతులను దారుణంగా దెబ్బతీశాయి. ఒక ఎకరాలో పత్తి దిగుబడి ఈసారి 15 క్వింటాళ్లకు పైగా వస్తుందని రైతులు ఆశించారు. అయితే.. కేవలం 8 నుంచి 10 క్వింటాళ్ల దాకా మాత్రమే రైతులకు అందింది. చేతికందిన పత్తిని అమ్ముకునేందుకు అవకాశం లేకుండా పోయింది. సీసీఐ అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా రెండు నెలలు జాప్యం చేయడంతో దాదాపు 50 శాతం పత్తిని రైతులు గ్రామాల్లోనే వ్యాపారులకు క్వింటం పత్తిని రూ.6వేల నుంచ రూ.6,500కు అమ్ముకుని నష్టపోయారు. క్వింటం ఉల్లిని రూ.300-400కు అమ్మాలని వ్యాపారులు డిమాండ్ చేయడంతో రవాణా ఖర్చులు కూడా గిట్టుబాటు కావని రైతులు పొలాల్లోనే పశువుల మేతకు వేశారు. మొక్కజొన్న రైతులు ఆరబెట్టుకునే అవకాశం కూడా లేకుండా వానలు తీవ్ర నష్టపరిచాయి.

అధికారులతో సమీక్షలు..

మొంథా తుఫాన్‌ను ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. కలెక్టర్ ఏ.సిరి ఇప్పటికే ఆయా శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించారు. లోతట్టు, తుంగభద్ర నదీతీర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. మంగళవారం తుఫాన్ ప్రభావం జిల్లాపై పెద్దగా లేదు. బుధవారం ప్రభావం చూపినా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

మిరపకు కుళ్లు తెగులు

హాలహర్వి మండలం గూళ్యం, జె.హోసల్లి, బాపురం, నెట్రవట్టి, చింతకుంట తదితర గ్రామాల్లో ఎల్లెల్సీ కాలువ కింద దాదాపు 5 వేల ఎకరాల్లో మిరప సాగు చేశారు. ప్రస్తుతం పూత, పిందె దశలో పైరు ఉంది. మొంథా తుఫాన్ వల్ల తేమ ఎక్కువై కుళ్లు తెగులు వ్యాపిస్తుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే పూత, పిందెలు రాలిపోతున్నాయని కన్నీరు పెడుతున్నారు. అధిక వర్షాలకు కుళ్లు తెగులు, ఆకుముడత తెగులు వ్యాపిస్తుందని అంటున్నారు. ఈ ఏడాది జిల్లాలో 15-20 వేల హెక్టార్లలో సాగు చేశారు. తుఫాన్ నిలువున ముంచేస్తుందని అన్నదాతలు కన్నీరు పెడుతున్నారు.

తేమ ఎక్కువై..

ఈఏడాది కంది 39వేల హెక్టార్లు, ఆముదం 9వేలు, పొగాకు 100, టమోటా 2,500 హెక్టార్లలో సాగు చేశారు. కంది పంట పూత, కాయ దశలో ఉంది. తేమ ఎక్కువైతే పూత రాలిపోతుంది. టమోటా పైరు కుళ్లిపోతుందని కష్టజీవులు కన్నీరు పెడుతున్నారు. జిల్లాలో ఉద్యానవన పంటలు సుమారుగా 35 వేల హక్టార్లలో సాగులో ఉన్నాయి. తుఫాన్ ప్రభావంతో ఆ పంటలు సైతం తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

21 మండలాల్లో వర్షం

జిల్లాలో 26 మండలాల్లో 21 మండలాల్లో మొంథా తుఫాన్ ప్రభావంతో వర్షం కురిసింది. 295.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు వర్షపాతం 11.4 మిల్లీమీటర్లు నమోదైందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా కోసిగి మండలంలో 42.4 మిల్లీ మీటర్లు వర్షం కురిసింది. కౌతాళం మండలంలో 34.4, ఆస్పరిలో 33.2 ఆదోనిలో 29.2, తుగ్గలిలో 29, పత్తికొండలో 26.2 ఆలూరులో 22.4, కల్లూరులో 19.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాంతటా ముసురు కమ్మేసింది.

ఇరవై ఎకరాల్లో వరి నేలపాలు



25 ఎకరాల్లో వరి సాగు చేశా. రూ.20లక్షల వరకు పెట్టుబడి పెట్టా. పైరు ఏపుగా పెరిగింది. వారం రోజుల్లో వరి కోతకు సిద్ధం చేసుకుంటున్నాం. మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు 20 ఎకరాల్లో చేతికొచ్చిన పైరు నేలపాలైంది. రూ.15 లక్షలు మేర పెట్టుబడి మట్టిపాలైంది.

● రంగస్వామి, వరి రైతు, సాతనూరు, కోసిగి మండలం

కష్టాలు తీరుతాయనుకుంటే..



ఎల్లెల్సీ కాలువ కింద ఐదెకరాల్లో మిరప సాగు చేశా. పూత, పిందె, కాయ దశలో ఉంది. తుఫాన్ ప్రభావంతో తేమ ఎక్కువై కుళ్ల తెగులు వ్యాపించింది. రెండేళ్లుగా గిట్టుబాటు ధరలేక అప్పుల పాలయ్యా. ఈఏడాదైనా కష్టాలు తీరుతాయనుకుంటే అధిక వర్షాలు ముంచేశాయి.

● బసవన్నగౌడ్, బల్లూరు, హాలహర్వి మండలం



సి.బెళగల్: పొలంలో చేరిన వర్షపునీరు

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

- క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాస్



ఎన్‌సీసీ విద్యార్థులతో రిజిస్ట్రార్ శ్రీనివాస్

కర్నూలు అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు మారు పేరు ఎన్‌సీసీ అని క్లస్టర్ యూనిర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాస్ అన్నారు. మంగళ వారం సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్లస్టర్ యూనివర్సిటీలో విద్యార్థులకు 28వ ఆంధ్ర బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ ఎం. శివకుమార్ ఆధ్వర్యంలో క్యాడెట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఎన్‌సీసీతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులకు రక్షణ రంగంలో పనిచేసే అవకాశం కలుగుతుందన్నారు. సుబేదార్ జక్తర్ సింగ్ మాట్లాడుతూ క్లస్టర్ వర్సిటీలో సిల్వర్ జూబ్లీ కళాశాల విద్యార్థులు ఎంతో కీర్తిని తెచ్చారని, దీన్ని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జడ్పీలో కంట్రోల్ రూం ఏర్పాటు

- సీఈవో నాసరరెడ్డి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను నేపథ్యంలో జడ్పీ(జిల్లాపరిషత్) పరిపాలన భవనంలో కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు సీఈవో నాసరరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. మండల కేంద్రాల్లో కూడా కమాండ్ కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల నుంచి సాధారణ ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే కమాండ్ కంట్రోల్ రూంకు చేరవేయాలని ఆయన సూచించారు.

హంద్రీకి నీరు విడుదల

- జీడీపీని పరిశీలించిన ఇరిగేషన్ ఈఈ



గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి హంద్రీకి విడుదలవుతున్న నీరు

గోనెగండ్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు (జీడీపీ) నుంచి హంద్రీకి నీటిని విడుదల చేస్తున్నారు. మంగళవారం ప్రాజెక్టు 4వ గేటు నుంచి 333క్యూసెక్కుల నీటిని జీడీపీ ఏఈ మహమ్మద్ అలీ తెలిపారు. మొంథా తుఫాన్ ముంచు కొస్తున్న కారణంగా ముందు జాగ్రత్తగా నీటిని విడుదల చేశామన్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 3.75 టీఎం సీల వరద చేరింది. గాజులదిన్నె ప్రాజెక్టును జిల్లా ఇరిగేషన్ ఈఈ పాండురంగయ్య పరిశీలించారు. గేట్లు ఎలా పనిచేస్తున్నాయి, ప్రాజెక్టులో ఎన్ని టీఎంసీల నీరు ఉంది తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాత్రి గంట గంటకు జీడీపీ అప్‌డేట్ ఇవ్వాలని ఏఈని ఆదేశించారు.

పత్తి కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్

- సీసీఐ ఆధ్వర్యంలో జిల్లాలో 20 కేంద్రాలు
- ఏర్పాట్లన్నీ పూర్తి



కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అత్యధికంగా దాదాపు 5.40 లక్షల ఎకరాల్లో కర్నూలు జిల్లాలో సాగైన పత్తి పంట రైతుల చేతికి వచ్చింది. ఈ పంటను ఎప్పుడెప్పుడు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు రైతులు ఎదురు చూస్తున్నారు. కేంద్రం కింటానికి రూ.8,110 మద్దతు ధర ప్రకటించింది. వర్షాలు, తుఫాన్ల నేపథ్యంలో పత్తిని అమ్ముకునేందుకు రైతులు పడుతున్న కష్టాలను గుర్తించిన కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు పత్తి కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని మంగళవారం మార్కెటింగ్ శాఖకు ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రం మొత్తం మీద సీసీఐ ఆధ్వర్యంలో 30 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఒక్క కర్నూలు జిల్లాలోనే 20 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం విశేషం. కర్నూలు జిల్లాలో 5.40 లక్షల ఎకరాలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేశారు. ఒక ఎకరాలో 8 నుంచి 10 క్వింటళ్ల పత్తి దిగుబడి వస్తుందని, వ్యవసాయ శాఖ యంత్రాంగం అంచనా వేసింది. ఈ లెక్కన 5.40లక్షల టన్నుల పత్తి దిగుబడి రైతుల చేతికి అందే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు. గత రెండు నెలల నుంచి రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాల కోసం కళ్లలో ఒత్తులు పెట్టుకుని ఎదురు చూశారు. ఎట్టకేలకు ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి బుధవారం నుంచి పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేసింది. కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరులోని పెంచికలపాడులో ఏర్పాటు చేసిన 20 పత్తి కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. వ్యవసాయ మార్కెటింగ్, సీసీఐ అధికారులు సమన్వయం చేసుకుని రైతుల నుంచి ఎటువంటి ఆటంకాలు లేకుండా కొనుగోలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలోని 15 మార్కెట్ కమిటీల చైర్మన్లు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి పత్తి కొనుగోళ్లను ప్రారంభించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.

ఆదోని అగ్రికల్చర్: కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) బుధవారం నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు మార్కెట్ యార్డ్ కార్యదర్శి గోవిందు తెలిపారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడారు. సీసీఐకు విక్రయించు కునేందుకు ముందుగానే స్లాట్ బుక్ చేసుకున్న రైతులు సూచించిన విధంగా ఎన్‌డీబీఎల్ జిన్నింగ్ పరిశ్రమకు తమ పత్తిని విక్రయించుకోవాలని సూచించారు. విక్రయానికి వచ్చే రైతులు తేమశాతం 8నుంచి 12శాతం లోపుఉంటే మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు గ్రామ రైతు సేవా కేంద్రాల్లో పంట వివరాలు నమోదు చేసుకొని కిసాన్ కపాస్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్‌తోపాటు సంబంధించిన రైతు తప్పకుండా ఉండాలన్నారు.

ఉల్లి రైతులను ఆదుకుంటాం

- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి
- కలెక్టర్ సిరి



గ్రేడింగ్ చేస్తున్న ఉల్లిగడ్డలను పరిశీలిస్తున్న కలెక్టర్

తుగ్గలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులను ఆదుకుంటామని కలెక్టర్ ఏ.సిరి అన్నారు. మంగళవారం మండలంలోని రాతనలో ఉల్లి పంటను గ్రేడింగ్ చేస్తున్న రైతుల వద్దకు కలెక్టర్ వెళ్లారు. ఎకరాకు ఎంత ఖర్చు అయిందని, ఎంత దిగుబడి వస్తుందని వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు కలెక్టర్‌తో తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ ఏడాది సకాలం వర్షాలు రావడంతో ఎకరాకు 75 క్వింటాళ్ల వరకు ఉల్లి ఎంత దిగుబడి వస్తుందని అనుకున్నట్లు తెలిపారు. 75 క్వింటాళ్లు వస్తాయనుకున్న పంట వర్షాలకు తడవడంతో సగానికి సగం ఉల్లిగడ్డలు కుళ్లి పాడైపోయ్యాయన్నారు. ఎకరాకు దాదాపు రూ.1.20 లక్ష వరకు పెట్టుబడులు పెట్టి సాగు చేస్తే ఎకరాకు రూ.30 నుంచి రూ.40వేల వరకు దిగుబడి వచ్చిందన్నారు. రైతులకు ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్య శరణ్యమని వినతి పత్రం అందజేశారు. వ్యవసాయాధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లి పంట సాగు చేసిన రైతులందరినీ ఈక్రాఫ్ నమోదు చేయాలన్నారు. మొంథా తుఫాన్ పై రైతులకు, ప్రజలకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు చేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు కార్యక్రమంలో ఆర్డీవో భరత్ నాయక్, తహసీల్దార్ రవి, టీడీపీ తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి, వ్యవసాయాధికారి సురేష్ యాదవ్, ఆర్ఐ వెంకట్రాముడు, వీఆర్వో నాగేంద్ర, ఏఈవోలు లక్ష్మీనారాయణ, మల్లేష్ ఉన్నారు.

మెనూ పాటించకపోతే చర్యలు

ప్రభుత్వ పాఠశాలలో, హాస్టళ్లలో భోజనం విషయంలో మెనూ తప్పక పాటించాలని, లేదంటే చర్యలు తప్పవని కలెక్టర్ ఏ.సిరి హెచ్చరించారు. రాతన గిరిజన సంక్షేమ హాస్టల్ ఆశ్రమ పాఠశాలలో తనిఖీ చేసి హాస్టల్‌లో డైనింగ్ హాల్, వంట గది, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వమోహన్, ఎంఈవోలు రమావెంకటేశ్‌గౌడు, మాలతి, ఏపీవో హేమసుందర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీ న్యూలెక్చరర్ గ్యాలరీలో వైద్య విద్యార్థులకు యాంటి ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినరసమ్మ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు తమ విద్యలో చాలా దూరం ప్రయాణించాల్సి ఉందని, చిన్న చిన్న విషయాలను పట్టించుకోవద్దని, తమ కేరీర్ గురించి ఆలోచించాలని సూచించారు. ఎంతో ప్రతిభ గల విద్యార్థులకే వైద్యవిద్యలో ప్రవేశం లభిస్తుందని అంత కష్టాన్ని సాధించిన మీరు చిన్న చిన్న విషయాలకు కుంగిపోవడం బాధపడడం, ఎక్కువగా స్పందించడం చేయవద్దని అన్నారు. మీ లక్ష్యం డాక్టర్ అయి ఉన్నత శిఖరాలకు చేరడం, అని మరువకూడదన్నారు. సమాజంలో వైద్యులకు గౌరవస్థానం ఉందని, రోడ్లపై ప్రయాణం చేసేటప్పుడు మీరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. వైద్య విద్యార్థులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, ఏమైనా సమస్యలు ఏర్పడితే కాలేజీ అధికారులు దృష్టికి తీసుకెళ్లాలని, విద్యార్థులు నేరుగా తనకు కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సదస్సులో కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాళ్లు డా.సాయిసుధీర్, డా.రేణుకాదేవి, త్రీటౌన్ సీఐ శేషయ్య, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్.. డేంజర్


- ప్రతి నలుగురిలో ఒకరికి
- యువతలో పెరుగుతున్న వ్యాధి
- నేడు వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే 6

నంద్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాలు 7

బ్రెయిన్ స్ట్రోక్.. డేంజర్

మారుతున్న జీవనశైలి, ఒత్తిడి, జన్యుపరమైన కారణాలతో 25 ఏళ్లలోపు యువత బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడుతున్నారు. ఒకప్పుడు 60-70 ఏళ్ల వయస్సులో ఈ సమస్య కనిపించేది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 25 ఏళ్లు పైబడిన ప్రతి నలుగురిలో ఒకరికి స్ట్రోక్ వస్తున్నది. పక్షవాతంపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం 2006 నుంచి వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ ప్రపంచ పక్షవాత నివారణ దినాన్ని పాటిస్తున్నది. ఈ ఏడాది లక్షణాలు గుర్తించండి.. ప్రాణాలను కాపాడండి.. అన్న నినాదాన్ని ప్రజలకు అందించింది.

- ప్రతి నలుగురిలో ఒకరికి
- యువతలో పెరుగుతున్న వ్యాధి
- ఆసరా ఇస్తున్న కర్నూలు జీజీహెచ్ బ్లాక్ యూనిట్
- నేడు వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే



కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మనదేశంలో ప్రతి లక్ష మందికి 145 మంది బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడుతున్నారు. ప్రతి నిమిషానికి ముగ్గురు బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడుతున్నారు. రక్తం గడ్డ కట్టడం ద్వారా రక్త నాళాలు పూర్తిగా లేదా పాక్షికంగా మూసుకుపోయి మెదడుకు రక్త సరఫరా సక్రమంగా జరగకపోవడం స్ట్రోక్‌కు కారణమవుతోంది. దీనికి హైబీపీ, మధుమేహం, పొగ తాగడం, ఒత్తిడి కారణాలని వైద్యులు చెబుతున్నారు. బ్రెయిన్ స్ట్రోక్ ఎలాంటి ముందస్తు హెచ్చరిక లేకుండా అకస్మాత్తుగా వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా యువకుల్లో ఇప్పుడు స్ట్రోక్ సాధారణంగా మారుతుంది. ప్రారంభ దశలోనే లక్షణాలను గుర్తించడం చాలా కీలకం. ఒకప్పుడు 50 ఏళ్లు దాటిన వారు స్ట్రోక్‌కు గురయ్యేవారు. ఇప్పుడు 20 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు వారు స్ట్రోక్‌కు గురవుతున్నారు.

ఎలా గుర్తించాలి... ?

- ఒక వైపు చేయి, కాలు పని చేయకపోవడం
- ఆకస్మాత్తుగా తల తిరగడం, శరీరం అదుపు తప్పడం
- మూతి ఒక వైపునకు వంకర పోవడం
- దృష్టి ఇబ్బందులు.. వ్యక్తిని సరిగ్గా చూడకపోవడం
- ఆకస్మాత్తుగా తీవ్రమైన తలనొప్పి, వాంతులు, స్పృహ కోల్పోవడం

బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణాలు

ముందస్తు సూచనలు లేకుండా మెదడుకు ఆక్సిజన్, పోషకాలను తీసుకెళ్లే రక్తనాళాలకు అవరోధం కలగడం, చిట్లడం వల్ల మెదడు లోని కొంతభాగం మరణానికి దారితీసి స్ట్రోక్‌కు గురవుతారు.

- స్మోకింగ్, ఆల్కహాల్ ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు.
- జీవన విధానంలో మార్పులు, హైబీపీ, మధుమేహం, కొలస్ట్రాల్, ఊబకాయం, గర్భనిరోధక మాత్రలు వాడిన మహిళల్లో స్ట్రోక్ వచ్చే అవకాశం.

రకాలు: పక్షవాతంలో రెండు రకాలు. ఒకటి ఇస్కిమిన్ స్ట్రోక్. రక్తనాళంలో అడ్డంకుల కారణంగా ఈ స్ట్రోక్ వస్తుంది. పక్షవాతానికి గురయ్యేవారిలో 80 శాతం ఈ రకమైన పక్షవాతానికి గురవుతున్నారు. రెండో రకం రక్తనాళం చిట్లడం వల్ల హిమరెజిక్ స్ట్రోక్ వస్తుంది.



న్యూరో ఐసీయూలో కార్పొరేట్ వైద్యం

గత రెండేళ్ల క్రితం కర్నూలు జీజీహెచ్‌లోని న్యూరాలజీ విభాగంలో 12 పడకలతో స్ట్రోక్ ఐసీయూ యూనిట్‌లో కార్పొరేట్ వైద్యం అందుతుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలతో పాటు మరో ఆరు జిల్లాల నుంచి ప్రతి నెలా 1500 నుంచి 2వేల వరకు రోగులు న్యూరాలజీ ఓపీకి వస్తుంటారు. ఇక స్ట్రోక్ ఐసీయూతో పాటు ప్రతి నెలా న్యూరాలజీ విభాగంలో 150 మంది రోగులకు చికిత్స అందిస్తున్నారు. న్యూరాలజీ విభాగానికి ప్రతి సోమ, గురువారాలు ఓపీ ఉంటుంది. మిగతా రోజుల్లో అత్యవసరమైన రోగులకు న్యూరాలజీ విభాగం వద్ద ఓపీ సేవలు అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బ్రెయిన్ స్ట్రోక్ రోగులు 80వేల మంది ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. కర్నూలు నంద్యాలలోని ప్రైవేటు హాస్పిటల్స్‌లో బ్రెయిన్ స్ట్రోక్‌కు చికిత్స అందిస్తున్నారు.

మొదటి 4 గంటలు కీలకం



బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన తర్వాత మొదటి 4-5 గంటలు అత్యంత కీలకం. చికిత్స విధానం స్ట్రోక్ రకంపై ఆధారపడి ఉంటుంది. రక్తనాళాల్లో అడ్డంకుల వల్ల వచ్చే స్ట్రోక్, ఇస్కిమక్ స్ట్రోక్, థాంబో లైటిక్ థెరపి, మెకానికల్ థాంబెక్టమి వంటివి ఉంటాయి.

● డా.చల్లెపల్లి బాబురావు, కన్సల్టెంట్ , కిమ్స్ హాస్పిటల్, కర్నూలు

స్ట్రోక్ కేసులు పెరిగాయి



గతంతో పోలిస్తే బ్రెయిన్ స్ట్రోక్ కేసులు పెరిగాయి. ప్రతి నెల ఐసీయూ స్ట్రోక్ యూనిట్‌కు దాదాపు 90 కేసులు వస్తాయి. స్ట్రోక్ యూనిట్ వచ్చిన తర్వాత ఆధునిక వైద్య చికిత్స కూడా వచ్చాయి. న్యూరాలజీ ఓపీ వారంలో సోమ, గురువారాల్లో ఉంటుంది. ఇందులో 500 ఓపీకి వస్తుంటారు. స్ట్రోక్ ఐసీయూ యూనిట్‌లో 12 పడకలు ఉంటాయి.

● డా.సి. శ్రీనివాసులు, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, న్యూరాలజీ విభాగం, జీజీహెచ్ , కర్నూలు

జీవనశైలిలో వచ్చిన మార్పుల వల్లే..



యువకుల్లో స్ట్రోక్ పెరగడానికి జీవనశైలిలో వచ్చిన మార్పులే కారణం. జంక్ ఫుడ్ తినడం, వ్యాయామం లేకపోవడం, తక్కువ నిద్ర, అధిక స్క్రీన్ టైమ్, ఒత్తిడి, చిన్న వయస్సులోనే బ్రెయిన్ స్ట్రోక్ రావడానికి ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు.

● డా. రఘునందిని, కన్సల్టెంట్ న్యూరో ఫిజీషియన్, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి: కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

కోడుమూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ ఏ.సిరి ఉపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగదిలోకి వెళ్లి కూరగాయలను పరిశీలించారు. మధ్యాహ్నం భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారా? అని ప్రధానోపాధ్యాయులు ఇందిరాదేవిని అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో నీటి సమస్య ఉందని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఆమె స్పందిస్తూ డీఎంఎఫ్ నిధులతో వారంలో రోజుల్లో బోరు వేయిస్తామని హామీ ఇచ్చారు.

దళారులను దరి చేరనీయవద్దు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సీసీఐ కేంద్రాల్లో బుధవారం రైతుల నుంచి పత్తి కొనుగోలు చేయాలని, దళారులను దరి చేరనీయవద్దని కలెక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. గూడూరు మండలం పెంచికలపాడులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి రైతులతో మాట్లాడారు. మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి వ్యవసాయ శాఖ కర్నూలు ఏడీఏ శాలురెడ్డి, కోడుమూరు మార్కెట్ కమిటి కార్యదర్శి సుందర్‌రాజు, సీసీఐ అధికారులతో పత్తి కొనుగోళ్లకు సంబంధించి పలు సూచనలు అందజేశారు. రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న పత్తి నాణ్యత, నిల్వ సదుపాయాలు, యంత్రాల పనితీరు, కార్మికుల భద్రతా చర్యలు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించారు.

నాపరాయి పరిశ్రమను ఆదుకోవాలి

బనగానపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సంక్షోభంలో ఉన్న నాపరాయి పరిశ్రమను ఆదుకోవాలని మైనింగ్ ఓనర్లు, కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పలుకూరు గ్రామ క్రాస్ రోడ్డు వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. బనగానపల్లె, బేతంచెర్ల మండలాలకు చెందిన నాపరాయి మైనింగ్ ఓనర్లు, ట్రాక్టర్ యజమానులు, నాపరాయి కార్మికులు వందల ట్రాక్టర్లను రోడ్లపై నిలిపి ధర్నా చేశారు. మైనింగ్ ఓనర్లు, కార్మికులు, ట్రాక్టర్ యజమానులు మాట్లాడుతూ ఓ ట్రాక్టర్‌కు రెట్టింపు సంఖ్యలో రాయల్టీ వసూలు చేస్తున్నారన్నారు. ఒక టన్ను నాపరాయికి రూ.220లు చెల్లించాలని హైదరాబాద్‌కు చెందిన సుధాకర్ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్‌కు చెందిన వారు టెండర్ వేసి ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ముక్కుపిండి వసూలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే డీజిల్, విద్యుత్ ధరలు అధికంగా ఉండడం, రవాణా ఖర్చులు పెరిగిపోయాయన్నారు. దీనికి తోడు దినసరి కూలీ రేట్లు పెరిగాయన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి జోక్యం చేసుకొని ప్రభుత్వ దృష్టికి నాపరాయి పరిశ్రమ దుస్థితిని వివరించి రాయల్టీలు తగ్గించి నాపరాయి పరిశ్రమను ఆదుకోవాలని కోరారు.



ధర్నా చేస్తున్న మైనింగ్ ఓనర్లు, కార్మికులు

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

కొత్త తేదీన ఆర్యన్



విష్ణు విశాల్ కథానాయకుడిగా నటించిన 'ఆర్యన్' చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 31న ఈ చిత్రం విడుదలవ్వడం లేదు. ఒక వారం ఆలస్యంగా నవంబర్ 7న 'ఆర్యన్' చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు విష్ణు విశాల్ తెలిపారు. 'రవితేజ నటించిన 'మాస్ జాతర', 'బాహుబలి: ది ఎపిక్' చిత్రాలు కూడా ఈ నెల 31న విడుదలవుతున్నాయి. రవితేజతో నాకున్న స్నేహం, రాజమౌళిపై గౌరవంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఆయన తెలిపారు. అయితే 'ఆర్యన్' తమిళ వెర్షన్ మాత్రం ఈ నెల 31నే విడుదలవనుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'ఆర్యన్' చిత్రానికి ప్రవీణ్ కె దర్శకుడు. శుభ్ర, ఆర్యన్ రమేశ్ నిర్మించారు. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. సెల్వ రాఘవన్ కీలకపాత్ర పోషించారు. శ్రేష్ట్ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు.



ఉగాదిన విడుదల

అడివి శేష్ కథానాయకుడిగా షానియల్ డియో తెరకెక్కిస్తోన్న రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్'. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. మొదట డిసెంబరు 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా మేకర్స్ కొత్త తేదీని ప్రకటించారు. 2026 ఉగాది పండగ సందర్భంగా మార్చి 19న థియేటర్లలోకి రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత పోస్టర్‌ని అడివి శేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఈసారి మామూలుగా ఉండదు. ముందుకి వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరమే లేదు' అని క్యాప్షన్ పెట్టారు. కాగా, అడివి శేష్ సరసన కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

శ్రీకాంత్ తివారి వచ్చేస్తున్నాడు



ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై ఓ సరికొత్త ఒరవడిని సృష్టించిన వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్'. ఇప్పటి వరకూ రెండు సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్‌లో మూడో భాగం సిద్ధమైంది. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌ను రాజ్ అండ్ డీకే తెరకెక్కించారు. ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటి నుంచి స్ట్రీమింగ్ వివరాల కోసం అభిమానులు ఎంతగానో ఆసక్తిగా ఎదురుచూడసాగారు. తాజాగా మేకర్స్ స్ట్రీమింగ్ తేదీని ప్రకటించారు. ఆమెజాన్ ప్రైమ్‌లో నవంబరు 21 నుంచి అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా షేర్ చేశారు. థ్రెట్ అనాలిసిస్ అండ్ సర్వైవలెన్స్ సెల్(టాస్క్) సీనియర్ ఆఫీసర్ శ్రీకాంత్ తివారి పాత్రలో మనోజ్ బాజ్‌పాయ్ మరోసారి అలరించనున్నారు. రెండు సీజన్లలో మనోజ్ బాజ్‌పాయ్ నటనకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. ఇప్పుడు మూడో భాగంలో ఆయన నటనపై అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం భాషల్లో ఈ సిరీస్ అందుబాటులో ఉంటుంది.

చట్టమా? విశ్వాసమా?



యామీ గౌతమ్, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'హక్'. ముస్లిం మహిళల హక్కుల పోరాటంలో మైలురాయిగా నిలిచిన 'మొహమ్మద్ అహ్మద్ ఖాన్ వర్సెస్ షా బానో బేగం' కేసు ఆధారంగా రాసుకున్న కథతో దర్శకుడు సుపర్ణ్ వర్మ ఎస్ తెరకెక్కించారు. నవంబర్ 7న ఈచిత్రం విడుదలవుతోంది. హర్మాన్ బవేజా, విశాల్ గుర్నాని నిర్మించారు. మేకర్స్ మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. చట్టం, విశ్వాసం, న్యాయం మధ్య సంఘర్షణ ప్రధానాంశంగా దర్శకుడు కథను మలచిన తీరు ఆకట్టుకుంటోంది. షాబానో బేగం పాత్రలో యామీ గౌతమ్, ఆమె భర్తగా ఇమ్రాన్ హష్మీ తమదైన శైలిలో నటించి మెప్పించారు.

నటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ కావాలి



దేశవ్యాప్తంగా సినీ రంగంలో చర్చనీయాంశమైన పనివేళల అంశంపై కథానాయిక రష్మిక మందన్న స్పందించారు. వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్న రష్మిక తాను కూడా అధిక పని ఒత్తిడిని అనుభవిస్తున్నట్లు అంగీకరించారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ... రోజుకు పది పన్నెండు గంటలకు మించి పనిచేయడం ఎంత కష్టమో, కుటుంబ, వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించడం ఎంత అవసరమో ఆమె వివరించారు. 'నేను కూడా ఎక్కువగంటలు పనిచేస్తున్నాను. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఇలా చేయవద్దని అందరికీ చెబుతున్నాను. ఆఫీసులో ఉద్యోగులకు ఉన్నట్లే నటీనటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ ఉండాలి' అని రష్మిక అభిప్రాయపడ్డారు. ఒక షెడ్యూల్ పెట్టుకొని రోజుకు 8 గంటలు కంటినిండా నిద్రపోవాలి, వృత్తిని వ్యక్తిగత జీవితాన్ని బేలన్స్ చేసుకోవాలని ఆమె సూచించారు. నిర్ణీత పనివేళల డిమాండ్‌తో దీపికా పదుకొనే కొన్ని సినిమాల నుంచి వైదొలగినప్పటి నుంచి పలువురు నటీనటులు ఈ అంశంపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

నా కోసం ఆ వెన్నెల



ప్రేమలోని విభిన్న కోణాలను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఓ చెలియా'. నాగప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇందిరా దేవి ప్రొడక్షన్స్ పతాకంపై రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్నారు. ఎం. నాగ రాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 'నా కోసం ఆ వెన్నెల' అంటూ సాగే ప్రేమగీతాన్ని నటుడు జేడీ చక్రవర్తి చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు.. హీరో హీరోయిన్ల అనుబంధాన్ని వివరిస్తూ సాగే ఈ గీతానికి శివ సాహిత్యం అందించగా, ఎం.ఎం కుమార్ స్వరపరిచారు. మేఘన, మనోజ్ ఆలపించారు.

రెహమాన్ సంగీత విభావరి



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన సంగీత విభావరితో మరోసారి హైదరాబాద్ ప్రేక్షకులను అలరించబోతున్నారు. 'హైదరాబాద్ టాకీస్' ఆధ్వర్యంలో నవంబరు 8న రామోజీ ఫిలిం సిటీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ ' తెలుగు సినిమాలు చేస్తూనే పెరిగాను. 'ఏ మాయ చేశావే' మొదలు ఇటీవల రామ్ చరణ్ సినిమా వరకు ఇక్కడి ప్రేక్షకులు నన్ను ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు హైదరాబాద్ ప్రజలు నా కచేరీని గొప్పగా ఆస్వాదిస్తారని భావిస్తున్నా.' అని అన్నారు. కచేరీలో తన బాణీల గురించి వివరిస్తూ 'నాకు పాత స్వరాలను అనుసరించే సమయం లేదు. కొత్త అనుభూతి కోసం 'రోజా' లాంటి క్లాసిక్స్‌ని డాల్బీ అట్మోస్‌లో రీమిక్స్ చేస్తున్నాను. ఇప్పుడు సంగీతం గ్లోబల్ అయిపోయింది. ఎవరు ఏ భాషలో ఆస్వాదిస్తున్నారో ఎవరూ చెప్పలేరు. సంగీతంలో కొత్తదనం, స్పష్టత ముఖ్యం. అది ప్రేరేపించే భావోద్వేగం అన్నింటి కంటే మరీ ముఖ్యం' అని వివరించారు. కాగా, 2017లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ భారీ కచేరీలో రెహమాన్ ప్రేక్షకులను 'మా తుజే సలామ్' పాటతో ఉర్రూతలూగించారు. మళ్లీ ఇన్నేళ్లకు సంగీత ప్రియులను అలరించబోతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎంపీ

కర్నూలు అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు సూచించారు. మంగళవారం ప్రకటన విడుదల చేశారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో అవసరమైతేనే తప్ప బయటకు వెళ్లొద్దన్నారు. జిల్లా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారని లోతట్టు, నదీతీర ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలు పాటించాలన్నారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన


లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న మంత్రి, అధికారులు

నంద్యాల రూరల్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ముంచుకొస్తున్న నేపథ్యంలో నంద్యాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున మంగళవారం లోతట్టు ప్రాంతాలను మంత్రి ఎన్ఎండీ ఫరూక్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంతాలు దళితవాడ, కుందూ నదీ తీర ప్రాంతాలు, సలీంనగర్, చామకాల్వ, శ్యాం నగర్, ఎస్బీఐ కాలనీ, విశ్వనగర్ ప్రాంతాలను అధికారులతో కలిసి పర్యటించినట్లు తెలిపారు. ఇందుకు తగిన జాగ్రత్తలు ముందుగా తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రజల భద్రత, రక్షణకు ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా చర్యలు తీసుకుందని వెల్లడించారు. జిల్లా యంత్రాంగంలోని అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రజలను, వారి ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇందుకు 24 గంటలు అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ముంపునకు గురయ్యే గ్రామీణ ప్రాం తాల్లో కూడా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. తుఫాను కదలికలను అధికారిక వర్గాల నుంచి వచ్చే సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుని అప్రమత్తం చేయాలన్నారు. తుఫాను తగ్గేంత వరకు ప్రయాణాలు మానుకోవాలన్నారు. పశువులను, ఇతర పెంపుడు జంతువులను సురక్షిత ప్రాంతాలను తరలించాలన్నారు. విపత్కర సమస్యలు తలెత్తితే వెంటనే కంట్రోల్ రూంకు కానీ అధికా రులకు గానీ తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్, వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి , ఇలియాజ్, భాస్కర్ కమిషనర్ బండి శేషన్న, అధికారులు ఉన్నారు.

ఇద్దరు బిడ్డలతో నదిలోకి దూకి తల్లి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన పోలీసులు
- బంధువులకు అప్పగింత

మంత్రాలయం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓతల్లి తన ఇద్దరు బిడ్డలతో తుంగభద్ర నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు వెంటనే స్పందించి వారిని కాపాడరు. ఈఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకున్నట్లు ఎస్ఐ శివాంజల్ తెలిపారు. వివరాలు.. బెంగుళూరుకు చెందిన సౌమ్య భర్త శివానందతో గొడవపడింది. ఈనెల 27వ తేదీన తన ఇద్దరు పిల్లలైన భువనేష్, చార్వీతో బెంగూళూరు నుంచి రైలెక్కి మంత్రాలయం చేరుకుంది. మంగళవారం తెల్లవారుజామున పిల్లలతో తుంగభద్ర నది వద్దకు వచ్చింది. బెంగుళూరులోని బిడిది పోలీస్‌స్టేషన్ నుంచి మంత్రాలయం పోలీసులకు మహిళ ఇద్దరు పిల్లలతో మంత్రాలయంకు వచ్చారని సమాచారం అందింది. స్పందించిన ఎస్ఐ శివాంజల్, కానిస్టేబుల్ రామకృష్ణ, నాగరాజు నది దగ్గరకు వెళ్లి పరిశీలిస్తుండగా నది దగ్గర తల్లిపిల్లలు తుంగభద్ర నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా కాపాడి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. బెంగుళూరు పోలీసులు సౌమ్య అన్నలైన సనత్‌కుఉమార్, సచిన్, రాహుల్‌కు సమాచారం ఇచ్చారు. మంత్రాలయం వచ్చిన వారి అన్నలకు తల్లి ఇద్దరు పిల్లలను అప్పగించారు. ముగ్గురి ప్రాణాలను కాపాడిన ఎస్ఐ శివాంజల్, రామకృష్ణ, నాగరాజును అభినందించారు.

అభివృద్ధి పనులపై ఆరా

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులపై విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. నగరపాలక కార్యాల యంలోని ఇంజనీరింగ్ అధికారులను కలిసి వివరాలివ్వాలని కోరుతున్నారు. లిఖితపూర్వకంగా ఇవ్వాలని విజిలెన్స్ అధికారులు అడిగినా కూడా జాప్యం చేస్తున్నారు. అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి సంబంధించి వివరాలు ఇవ్వాలని కోరారు. ఒక్కసారిగా ఇంజనీరింగ్ విభాగంలో అలజడి మొదలైంది.

దొంగ అరెస్టు

బండిఆత్మకూరు అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం, బీ కోడూరు గ్రామాల్లో జరిగిన చోరీ కేసుల్లో దొంగను అరెస్టు చేసినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. మంగళవారం బండిఆత్మకూరు బస్టాండ్‌లో గూడూరుకు చెందిన రామాంజనేయులు అనే వ్యక్తి అనుమానంగా తిరుగుతున్నాడు. అతనిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతని వద్ద నుంచి 4తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఇవి మండలంలోని నారాయణపురం, బీ.కోడూరు గ్రామాల్లో చోరీ చేసినట్లు నిందితుడు తెలిపారన్నారు. ఈ మేరకు కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.


నిందితుడితో పోలీసులు

పెద్దాసుపత్రిలో వెంటిలేటర్ కోసం యువతి పడిగాపులు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిస్థితి సివియస్‌గా ఉన్న యువతి రేష్మా వెంటిలేటర్ కోసం గంటసేపు పడిగాపులు కాసిన ఘటన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల క్యాజువాల్టీలో చోటు చేసుకోంది. మంగళవారం రాత్రి మహిళకు ఫిట్స్ రావడంతో నగరంలోని ప్రైవేటు హాస్పిటల్‌కు వెళ్లారు. అక్కడ ప్రైవేటు ఆసుపత్రి ఖర్చులు భరించలేక రాత్రి 8 గంటల సమయంలో కర్నూలు జీజీహెచ్‌లోని క్యాజువాల్టీకి వచ్చారు. అక్కడ వెంటిలేటర్ బెడ్ ఖాళీ లేదని క్యాజువాల్టీ బయట అంబులెన్స్‌లో రోగిని గంటసేపు పడిగాపులు కాశారు. ప్రాణలతో కొట్టుమిట్టాడుతున్న రోగి బంధువులు అడ్మిషన్ చేయించుకోవాలని అంబులెన్స్ నుంచి బంధువులు ఎన్నిసార్లు విన్నవించినా వైద్యులు స్పందించలేదు. దీంతో విషయాన్ని హాస్పిటల్ సూపరింటెండెంట్ల దృష్టికి తీసుకెళ్లారు. చివరికి 9.15 గంటలకు రోగిని అడ్మిషన్ చేయించి వెంటిలేటర్ అమర్చారు.


క్యాజువాల్టీలో మహిళకు వెంటిలేటర్‌ను అమర్చిన వైద్యులు

నంద్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాలు

- అవుకు మండలంలో ఆర్టీసీ బస్సు, లారీ ఢీ
- ఒకరి మృతి.. 16 మందికి గాయాలు
- ఉయ్యాలవాడ మండలంలో కాలువలోకి దూసుకెళ్లిన బస్సు
- 15 మంది ప్రయాణికులు సురక్షితం



ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ, ఇన్‌సెట్‌లో లక్ష్మీదేవి(ఫైల్)

అవుకు/ఉయ్యాలవాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని అవుకు, ఉయ్యాలవాడ మండలాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అవుకు మండంలో ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా.. 16 మంది గాయపడ్డారు. ఉయ్యాలవాడ మండలంలో కాలువలోకి బస్సు దూసుకెళ్లింది. 15 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వివరాలివీ.. అవుకు రిజర్వాయర్ సమీపంలోని మలుపువద్ద ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్న ఘటనలో చాకలి లక్ష్మీదేవి (47) చెందింది. బస్సులో ప్రయాణిస్తున్న మరో 16 మంది ప్రయాణికులు గాయపడ్డారు. చిన్నారులు యశ్విక, పునీత్‌తో పాటు లక్ష్మీదేవి, నాగరాజు (బస్సు డ్రైవర్) నలుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు, నంద్యాల ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. బనగానపల్లె డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అవుకు బస్టాండు నుంచి 36 మంది ప్రయాణికులతో తాడిపత్రికి బయలుదేరింది. రిజర్వాయర్ సమీపంలోని మలుపు వద్దకు వచ్చే సరికి ఎదురుగా నాపరాతి బండల లోడ్‌తో వస్తున్న లారీ బస్సును ఢీకొట్టింది. బస్సు కుడిభాగంలోని మూడు సీట్లు నుజ్జయ్యాయి. డీజిల్ ట్యాంక్ లీకయింది.

ఈ రోడ్డు ప్రమాదంలో అవుకు మండలం శివవరం గ్రామానికి చెందిన లక్ష్మీదేవి అనే ప్రయాణికురాలు అక్కడికక్కడే మృతి చెందింది. గాయాలైన 16 మంది ప్రయాణికులను 108 ద్వారా అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. డోన్ ఆర్డీవో నరసింహులు, జిల్లా ఆర్ఎం రజియాసుల్తాన, బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథరెడ్డి, అవుకు ఎస్ఐ రాజారెడ్డి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఆసుపత్రికి చేరుకొని గాయపడ్డ వారిని పరామర్శించారు. మృతురాలి కుటుంబ సభ్యురాలు చౌడమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఉయ్యాలవాడ మండలంలోని సర్వాయిపల్లె గ్రామం వద్ద కోవెలకుంట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం రాత్రి కాలువలోకి దూసుకెళ్లింది. తిరుపతి నుంచి కోవెలకుంట్లకు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సులో 15 మంది ప్రయాణికులు ఉండగా వారు సురక్షితంగా బయట పడ్డారు. అయితే ఈ బస్సు ఇంజేడు గ్రామం మీదుగా వెళ్లాల్సి ఉండగా అక్కడ ఉన్న కుందరవాగు వంతెనపై వరద నీరు ప్రవహిస్తుండటంతో సర్వాయిపల్లె గ్రామం మీదుగా వెళ్లింది. వర్షం అధికంగా పడుతుండటమే ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.


కాలువలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

ఉపాధిలో కొత్త పనులకు బడ్జెట్ రూపకల్పన

- గ్రామాల వారీగా ప్రణాళిక తయారీ శ్రీకారం


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద వచ్చే సంవత్సరం (2026-27)కు గ్రామాల్లో చేపట్టాల్సిన పనులకు సంబంధించి ప్రతి పాదనలు సిద్ధం చేసేందుకు డ్వామా అధికారులు శ్రీకారం చుట్టారు. ఏటా డిసెంబరులోనే కార్మిక బడ్జెట్‌ను తయారు చేస్తారు. అక్టోబరు 3న మొదటి గ్రామసభలో ప్రణాళిక తయారీపై చర్చించాలని, నవంబరు 18న ఆయా గ్రామ పంచాయతీలు బడ్జెట్‌ను రూపొందించాలని, అదే నెల 30న మండల పరిషత్, డిసెంబరులో 15వ తేదీ నాటికి జడ్పీ ప్రణాళికలను ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ప్రక్రియ మొత్తం డిసెంబరు నెలాఖరుకు పూర్తి చేయాలని ప్రణాళికను యుక్తధార పోర్టల్‌లో అప్‌లోడు చేయాలని పేర్కొంది. ఒక వ్యక్తికి రోజుకు రూ.307 వేతనం మెటీరియల్ కింద రూ.204.66 ఖర్చు మొత్తం కలిపి రూ.511.66 బడ్జెట్‌ను రూపొందిస్తారు. నాలుగు కేటగిరీల కింద 192 రకాల పనులకు ఈ పథకం కింద అవకాశం కల్పించాలని కేంద్రం విడుదల చేసిన ఉత్తర్వుల్లో ఉంది. ఇందులో వ్యక్తిగత, సామాజికపరమైన పనులు ఉన్నాయి. మొక్కలు నాటడం, ఫీడర్ కెనాల్స్ నిర్మాణం, ఫీల్డ్ బండ్స్, భూమి అభివృద్ధి, కమ్యూనిటీ వాటర్ హార్వెస్టింగ్ పాండ్స్ రీచార్జ్ కిట్లు, సర్క్యులేషన్ ట్యాంకుల నిర్మాణం, వర్షం నీటి సంరక్షణ పనులు, ట్రెంచ్‌లు, చెక్‌డ్యామ్‌లు సాగునీటి బావుల నిర్మాణం, పంట కాలువలు చెరువుల్లో పూడిక తీతలు, కందకాల తవ్వకాలు, పండ్లతోటల పెంపకంతో పాటు తుపాన్ షెల్టర్లు, ప్రభుత్వ భవనాలు, రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

పంచాయతీ స్థాయిలో..

గ్రామ పంచాయతీ స్థాయిలో ఈ బడ్జెట్ రూపకల్పనకు కమిటీలు ఏర్పాటు చేశారు. దీనిలో సాంకేతిక సహాయకులు, జీఎస్టీ, సచివాలయ సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, క్షేత్ర సహాయకులు పంచాయతీలో సీనియర్ మేట్లు, లైన్ డిపార్టుమెంట్ల నుంచి సభ్యులు ఉంటారు.ఈ బృందాన్ని ఏపీవో పర్యవేక్షిస్తారు. గ్రామసభల షెడ్యూల్ పీవో, ఎంపీడీవోలు నిర్ణయిస్తారు. కూలీలు, హేబిటేషన్ల ప్రాతిపదికన మూడు, నాలుగు రోజుల్లో ప్రణాళిక తయారు చేయాలి. ఈసారి కొత్త సంవత్సరం చేపట్టబోయే పనుల్లో గ్రామాల్లో పాడిపశువుల కోసం గోకులాలు, మ్యాజిక్ డ్రైన్లకు ప్రాధాన్యం ఇస్తారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు మూడున్నర లక్షల మందికి జాబ్‌కార్డులు ఇచ్చారు. ఈ రెండు జిల్లాల్లో 5 లక్షల మంది దాకా సీజన్‌లో పనులు చేస్తున్నారు. ప్రస్తుతం క్రియాశీలక జాబ్‌కార్డులు రెండున్నర లక్షల దాకా ఉన్నాయి. రెండు జిల్లాలో కలిపి వేసవి సీజన్‌లో 2 లక్షల మంది దాకా పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

ఉపాధి ప్రణాళిక తయారు చేస్తాం



వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద రైతులు, కూలీలకు పనులు కల్పించేందుకు అవసరమైన ప్రణాళికలను గ్రామాల వారీగా రూపొందించాలని కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 16న పర్యటిస్తున్నందున ఆ కార్యక్రమం పూర్తయిన తర్వాత గ్రామాల వారీగా గ్రామ సభలు ఏర్పాటు చేస్తాం. దశల వారీగా ఉపాధి ప్రణాళికను గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు తయారు చేసి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాము. **- వెంకటరమణయ్య, పీడీ**

వ్యక్తి మృతదేహం లభ్యం

కోడుమూరు రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాలకుర్తి గ్రామ పరిధిలోని పొలాల దారిలో ఓవ్యక్తి మృతదేహం లభ్యమైంది. మంగళవారం ఉదయం అటుగా వెళ్తున్న కొందరు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఇన్‌చార్జి సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ స్వామి సిబ్బందితో చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడు దేవనకొండ మండలంలోని పి.కోటకొండ గ్రామానికి చెందిన దస్తగిరి ఆచారి(38)గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. మృతుడు దస్తగిరి ఆచారికి అదే మండలంలోని చెల్లెలి చెలిమ గ్రామానికి చెందిన వెంకటేశ్వరమ్మతో 16 ఏళ్ల క్రితం వివాహ మైంది. వారికి ఇద్దరు కొడుకులు, కూతురు సంతానం. వెంకటేశ్వరమ్మ ఆశా వర్కర్‌గా పనిచేసేది. దస్తగిరిఆచారి ప్రైవేటు వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య ప్రవర్తన సరిగా లేదంటూ ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో నాలుగు నెలల క్రితం వెంకటేశ్వరమ్మ ఆశా వర్కర్ జాబ్ వదులుకుని పెద్దపాడు మకాం మార్చింది. మూడు నెలల క్రితం దస్తగిరిఆచారి భార్యతో రాజీ చేసుకుని అందరూ కలిసి ఉన్నారు.

అతడు 15 రోజుల క్రితం బళ్లారికి వెళ్లాడు. అక్కడి నుంచి భార్యకు తరచూ ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. మూడురోజుల క్రితం తరిగివచ్చిన దస్తగిరిఆచారి భార్య ప్రవర్తనపై గొడవపడ్డాడు. ఈ విషయమై సోమవారం కర్నూలులో బామ్మర్దులు దాడిచేసి కొట్టారని దస్తగిరిఆచారి సోదరికి ఫోన్‌చేసి మొరపెట్టుకున్నాడు. మంగళవారం ఉదయం ప్యాలకుర్తి వద్ద శవమై కనిపించాడు. ఇన్‌చార్జి సీఐ, ఎస్ఐ డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంను రంగంలోకి దింపారు. మృతుడి తండ్రి వెంకటరాముడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉర్దూ చదవాలంటే.. ఊరు వదలాల్సిందే..!

- పదో తరగతితోనే చదువును ఆపేస్తున్న విద్యార్థులు
- మిథ్యగా మారిన ఉర్దూ జూనియర్ కళాశాల
- ఇంటర్ కోసం 50 కిలోమీటర్లు ప్రయాణించాల్సిందే
- నత్తనడకన ఉర్దూ ఐటీఐ కళాశాల నిర్మాణం


చాగలమర్రిలో నాలుగేళ్లుగా నత్త నడకన సాగుతున్న కళాశాల

ఉర్దూ దక్షిణాసియాలో మాట్లాడే ఇండో-ఆర్యన్ భాష. భారతదేశంలో అధికారికంగా గుర్తించిన భాషల్లో ఉర్దూ ఒకటి. ఉర్దూకు ఎంతో ప్రాముఖ్యత ఉన్నప్పటికీ నేటికీ పలుచోట్ల ఉర్దూను చిన్న చూపు చూస్తున్నారు. ఉర్దూ మీడియం స్కూళ్లు ఉన్నా కాలేజీలు మాత్రం చాలా తక్కువ అనే చెప్పవచ్చు. నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ పరిసర మండలాల విద్యార్థులు ఉర్దూ మీడియంలో ఇంటర్మీడియట్ చదవాలంటే ఊరి వదలాల్సిన పరిస్థితి నెలకొంది. ఉర్దూను ఎక్కువగా మైనార్టీ విద్యార్థులు (బాల, బాలికలు) చదువుతారు. ముఖ్యంగా బాలికలు పదో తరగతి వరకు ఆయా మండలాల్లో ఉన్న ఉర్దూ పాఠశాలల్లో చదువును కొనసాగించి చదువులను ఆపేస్తున్నారు. కారణం దగ్గర్లో సరైన ఉర్దూ జూనియర్ కళాశాలలు లేకపోవడమే. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను బయటికి పంపలేక వారి భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారు.

ఆళ్లగడ్డ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఉర్దూ చదువుకునే విద్యార్థులకు పదో తరగతి వరకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఇక ఇంటర్‌లో చేరాలంటే అసలు సమస్య. ఎందుకంటే ఆళ్లగడ్డ నుంచి అటు.. ఇటుగా ఇంటర్ కళాశాలలు. దాదాపు 50కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. నంద్యాలకు రావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉర్దూ కళాశాల విద్య మిథ్యగా మారింది. చాలా మంది ముస్లిం మైనార్టీ విద్యార్థులు చేసేదేమీ లేక చదువు మానుకొని ఇంటి పనులకు పరిమితమౌతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనార్టీల విద్యాభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇవ్వడం లేదు.

'ప్రధాన మంత్రి జన వికాస్' పేరిట..

మైనార్టీ విద్యార్థులకు విద్య, నైపుణ్యాభివృద్ధి స్వయం సంవృద్ధి కోసం ప్రధాన మంత్రి జనవికాస్ పేరిట పథకాన్ని ప్రారంభించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆరు మండలాలు ఈ పథకానికి ఎంపిక య్యాయి. వీటిలో ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీలు ఎక్కువగా ఉన్న చాగలమర్రి, శిరివెళ్ల మండలాలను ఎంపిక చేశారు. మండలాల్లో రూ 6కోట్లతో ఉర్దూ ఐటీఐ కళాశాలల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఈపనులు నాలుగేళ్లగా నత్తనడకన సాగుతున్నాయి. చాగలమర్రి మండలంలోని పెద్దవంగలి గ్రామంలో రూ 3.99 కోట్ల తో ఐటిఐ కళాశాల భవన నిర్మాణ పనులు చేపట్టి అర్థంతరంగా నిలిపి వేశారు. అలాగే శిరివెళ్ల లో రూ 1.99 కోట్లతో ఉర్దూ ఉన్నత పాఠశాల నిర్మాణం ఇంకా ప్రారంభించ లేదు.

ఇంటికే పరిమితం

ఉర్దూ పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఇంటర్ చేయాలంటే నంద్యాల, కడప జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి. చాలా మంది ముస్లింలు తమ పిల్లలను దూర ప్రాంతానికి పంపలేక ఇంటి పనులకు పరిమితం చేస్తున్నారు. చాగలమర్రి, శిరివెళ్ల, ఆళ్లగడ్డ మండలాల్లో ముస్లింల జనాభా అధికంగా ఉంది. ఆళ్లగడ్డ మండలంలోని ఓబులంపల్లెలో 60 శాతం మంది ముస్లింలున్నారు. ఉర్దూ పాఠశాలలో కేవలం నలుగురు మాత్రమే విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేక పోవడం, ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్య పెంచేందుకు తగు చర్యలు తీసుకోక పోవడం తో ఏడాదికి ఏడాది విద్యార్థుల సంఖ్య తగ్గు ముఖం పడుతూ వస్తుంది. మరి ముఖ్యంగా పది తరకు చదవు కొన్న తరువాత ఏమి చదవాలి. ఎక్కడ చదవాలి అన్న ప్రశ్న కూడా తల్లితండ్రులలో ఉండడంతో ఉర్దూపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని రెండు మండాల్లో ఉర్దూ కళాశాలల నిర్మాణాలు చేపట్టి త్వరిత గతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

చదువు మాన్పించి వేస్తారేమోనని..



చాగలమర్రిలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నా. మా పాఠశాలలో మాకంటే ముందు చదువుకున్న అక్కలు పదో తరగతి చదివి ఏమి చేయాలో తెలియక చదువులు మానేశారు. మాకు కూడా అదే గతి పడుతుందేమోనని, తల్లిదండ్రులు చదువులు మాన్పించి వేస్తారేమోనని భయమేస్తోంది. ● **మాబుచాన్, పదో తరగతి, చాగలమర్రి**

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు

ఆళ్లగడ్డలోని పాత మసీదు సమీపంలో ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. ఇందులో పదో తరగతి నడపడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం. ముస్లింలు ఎక్కువగా ఉన్న ఓబులంపల్లె ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. ● **శోభావివేకవతి, ఎంఈవో, ఆళ్లగడ్డ**



నగరంలో వర్షం

మొంథా తుఫాను ప్రభావంతో నగరంలో మంగళవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వర్షం కురిసింది. దీంతో విద్యార్థులు తడుస్తూనే పాఠశాల, కళాశాలలకు వెళ్లారు. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఫొటోలు : స్టాఫ్ పొటోగ్రాఫర్, కర్నూలు.





త్వరగా ఇంటికి చేరుకోవాలి.. వర్షంలో వెళుతున్న విద్యార్థులు



వాహనదారుల ఇబ్బందులు



నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నగర పాలక స్టాండింగ్ కమిటి సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు చైర్మన్ బీవై.రామయ్య అధ్యక్షతన కమిషనర్ ఛాంబర్‌లో ఉంటుందన్నారు. అన్ని విభాగాల అధికారులు హాజరు కవావాలని, సమావేశంలో ఆమోదించే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కమిషనర్ ఆదేశించారు.

అప్రమత్తంగా ఉండాలి

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత



కల్లూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి సూచించారు. తసీల్దార్లు, ఎంపీడీవో, జలవనరుల, విద్యుత్, వ్యవసాయ, పోలీసు, వైద్యాధికారులు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటికి రావద్దని, తల్లిదండ్రులు పిల్లలను బయటకు పంపకుండా జగ్రత్తగా చూసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

గూడూరులో మోస్తరు వర్షం

గూడూరు అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో మంగళవారం మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షపు నీరు వెళ్ళేందుకు నగర పంచాయతీ సిబ్బంది కల్వర్టులను వెడల్పు చేయించారు. ముందు జాగ్రత్తగా పునరావాస కేంద్రం, కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జ్ కమిషనర్ విజయలక్ష్మీ, శానిటరీ ఇన్‌సెక్టర్ రాఘవేంద్ర తెలిపారు



కల్వర్టును వెడల్పు చేస్తున్న సిబ్బంది

రైతులు నష్టపోకుండా చూడాలి

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పొగాకు సాగు చేసిన రైతులు నష్టపోకుండా చూడాలని వ ఏడీఏ శాలురెడ్డి ఆదేశించారు. మంగళవారం కార్యాలయంలో వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సవమావేశం నిర్వహించారు. కంపెనీల యజమానులు, రైతుల మధ్య కుదిరిన బైబ్యాక్ ఒప్పంద ప్రతిని పొందిన తర్వాతే పంట నమోదు చేయాలని అగ్రిమెంటు లేకపోతే ఈ క్రాప్ చేయవద్దన్నారు. రైతులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పొగాకు కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను తెలియచేయాలన్నారు. అలసత్వం వహిస్తే సిబ్బందిపై చర్యలు తప్పని ఏడీఏ హెచ్చరించారు.

తాగునీరు ఇచ్చి రుణం తీర్చుకుంటా



కోడుమూరులో సమస్యలు తెలుసుకుంటున్న విష్ణు, ఎమ్మెల్యే

కోడుమూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు తాగునీరు అందించి వారి రుణం తీర్చుకొంటానని కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరితో పాటు కొండపేటలో మంగళవారం పర్యటించి సమస్యలను తెలుసుకొన్నారు. మహిళలు మాట్లాడుతూ ఐదు రోజులకోసారి మాత్రమే కొళాయిలకు నీరు వస్తోందని సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని విష్ణువర్ధర్‌రెడ్డిని కోరారు. స్పందించిన ఆయన సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని, శాశ్వత పరిష్కారానికి నిధులు ఇస్తారని హామీ ఇచ్చారన్నారు. బుడగజంగాల కాలనీలో సీసీ రోడ్లు వేయాలని కోరగా, ఎంపీడీవో రాముడుకు ఫోన్ చేసి రోడ్లు వేయించాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ప్రజలను కోరారు. నాయకులు రామకృష్ణారెడ్డి, గోపాల్‌నాయుడు, గంగాధర్, చంద్రమౌళి, రవీంద్రగౌడ్ పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడాకారులతో ఆర్‌యూ ఉపకులపతి

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29 నుంచి చెన్నైలోని వినాయక మిషన్ యూనివర్సిటీలో నిర్వహించనున్న అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల కబడ్డీ పోటీల్లో ఆర్‌యూ జట్టు పాల్గొననుంది. మంగళవారం ఉపకులపతి ప్రొ.వి.వెంకట బసవరావు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ప్రతిభ చూపి విశ్వవిద్యాలయానికి పేరు తీసుకురావాలని కోరారు. విశ్వవిద్యాలయ రెక్టార్ ప్రొ.ఎన్‌టీకే, రిజిస్ట్రార్ డా.బోయ విజయకుమార్, ప్రొఫెసర్ సీవీ కృష్ణారెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డా.కేవీ శివకిషోర్, పీడీ ముర్తయ్య పాల్గొన్నారు.

ద్వాదశి వేడుకలు జయప్రదం చేయండి

కోడుమూరు రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్కూరు హరిజనవాడల రామాలయంలో వచ్చేనెల 2న నిర్వహించనున్న ద్వాదశి వేడుకలు జయప్రదం చేయాలని హిందూ ధర్మప్రచార పరిషత్ సభ్యుడు ఎద్దుల మహేశ్వరరెడ్డి, కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి కోరారు. మంగళవారం కరపత్రాలు విడుదల చేశారు. టీటీడీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తుందన్నారు. తెలిపారు. శోభాయాత్ర, నగరసంకీర్తన, పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. సభ్యులు తోటన్న, పక్కీరన్న, మదనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న ప్రతినిధులు

రహదారి నిర్మాణానికి సీఎం హామీ

సి. బెళగల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబందహాల్ ఆర్‌ఎంబీ రోడ్డు నిర్మించాలని సీఎం ఆదేశించినట్లు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. మంగళవారం ఆర్‌ఎంబీ ఎస్‌ఈ మహేశ్వరరెడ్డి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి రహదారిని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలం లో రహదారులు దెబ్బతిన్నట్లు అసెంబ్లీలో తాను మాట్లాడనన్నారు. స్పందంచిన సీఎం చంద్రబాబు రూ.3.50 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈఈ సునీల్‌రెడ్డి, డీఈ రమణ, ఏఈ పెర్సీస్‌ఫెబీ, టీడీపీ కన్వీనర్ చంద్రశేఖర్, సింగిల్ విండో ప్రెసిడెంట్ డాక్టర్ తిమ్మప్ప, బీమన్న, అమర్, బాలాజీ, గొల్లలదొడ్డి జగన్‌మొహన్‌రెడ్డి ఉన్నారు.

పారా మెడికల్ పరీక్షలో విజయభేరీ

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పారా మెడికల్ డిప్లమా 2023-25 పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు 80శాతం ఉత్తీర్ణత సాధించినట్లు జయలక్ష్మి పారా మెడికల్ కాలేజీ డైరెక్టర్ మల్లికార్జున తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ 96 మంది పరీక్షలు రాయగా 77 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. అనస్థీషియా ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డిప్లమా మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సుల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. మొదటి ర్యాంకు జి.రామాంజి, 2వ ర్యాంకు వీరేష్, 3వ ర్యాంకు చరణ్‌తేజ నిలిచి కాలేజీ ప్రతిష్టను ఇమిడింపజేశారన్నారు.

11 నుంచి అంతర్ పాఠశాలల క్రీడలు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నవంబరు 11, 12 తేదీల్లో చిన్నటేకూరు వద్ద ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ క్రీడామైదానంలో ఉమ్మడి కర్నూలు జిల్లా అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు మంగళవారం తెలిపారు. వాలీబాల్ (బాలబాలికలు), హ్యాండ్‌బాల్ (బాలబాలికలు), పుట్‌బాల్ (బాలురు), బాస్కెట్‌బాల్ (బాలికలు), రగ్బీ (బాలబాలికలు), చెస్ (బాలబాలికలు) రైఫిల్ షూటింగ్ (బాలబాలికలు) క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబరు 7వ తేదీ లోపు పేర్లు నమదో చేసుకోవాలని వివరాలకు 9393827585 నంబర్లో సంప్రదించాలన్నారు.

అధికారులకు విధుల కేటాయింపు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయం ఇంజనీరింగ్ అధికారులకు విధులను కేటాయిస్తూ కమిషనర్ పి.విశ్వనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. వీధి దీపాలు, సీసీ కెమెరాలు, ట్రాఫిక్ సిగ్నల్స్, పార్కుల్లో లైట్లను పర్యవేక్షించేందుకు ఎంఈ, డీఈ, ఏఈలకు అప్పజెప్పారు.

అసభ్యకర పోస్టులపై చర్యలు తీసుకోవాలి

గూడూరు అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో సీఎం చంద్రబాబును వ్యక్తిగతంగా విమర్శిస్తూ అసభ్యకరంగా పోస్టులు పెట్టిన వైసీపీ నాయకుడు శ్రీధర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు జె సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కె.నాగలాపురం గ్రామంలో మాట్లాడుతూ చిన్నటేకూరు వద్ద బస్సు ప్రమాదం రోజు ప్రమాదానికి కారణమైన వ్యక్తులు లైసెన్స్ ఉన్న దుకాణంలో మద్యం కొన్నట్లు సీసీ కెమరాల్లో రికార్డు అయినా, బెల్టుషాపులో కొన్నట్లు వైసీపీ నాయకుడు ఆరోపిస్తూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం శాంతి భద్రతలకు విఘాతం కల్పించడమేనన్నారు. శ్రీధర్‌పైడ్డి కేసు కె నాగలాపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. ఈ విషయపై ఎస్‌ఐని వివరణ కోరేందుకు సంప్రదించగా ఎస్‌ఐ ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

ప్రోత్సాహకాలకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాకారులే నగదు ప్రోత్సాహకాల కోసం నవంబరు 4లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మంగళవారం తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశానుసారం 2024-2029 స్పోర్ట్స్ పాలసీ కింద జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు అర్హులన్నారు. వివరాలకు 815225419, 9866317318 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'దళితుల ప్రదర్శన విజయవంతం చేయాలి'

కర్నూలు కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నవంబరు 1న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చేపట్టిన దళితుల ఆత్మగౌరవ మహాప్రదర్శనను విజయవంతం చేయాలని నగర అధ్యక్షురాలు మీసాల సుమలత పిలుపునిచ్చారు. మంగళవారం 48వ వార్డు రోజా వీధిలో ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు.

గురుకులంలో క్రీడలు



చెస్ పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

సి.బెళగల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ చింతలయ్య అధ్యక్షతన మంగళవారం మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. పీడీ రాఘవేంద్ర మాట్లాడుతూ 14 జడ్పీ ఉన్నతపాఠశాలల్లో చదువు తున్న 9, 10 వతరగతి విద్యార్థులకు అండర్ 14, అండర్ 17 విభాగంలో క్రీడలు నిర్వహించామన్నారు. కబడి, కోకో, చెస్, యోగా, బ్యాడ్మింటన్‌లో 596 మంది విద్యార్థులు పాల్గొన్నారని విజేతలకు బహుమతులను ఇస్తామన్నారు. పీఈటీలు సత్యకుమార్, శ్రావణి, లక్ష్మీరమణ, వీనమ్మ, ఉస్మాన్ బాషా, టీడీపీ కన్వీనర్ చంద్రశేఖర్, సింగిల్ విండో ప్రెసిడెంట్ తిమ్మప్ప పాల్గొన్నారు.

యువతులు మోసపోకుండా చూసుకోవాలి

కర్నూలు అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): యువతులు రిలేషన్‌షిప్, ప్రేమ పేరుతో మోస పోకుండా చూసుకోవాలని ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి సూచించారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శక్తి టీమ్, వన్‌స్టాప్ సెంటర్ అధికారి జి.శ్రీనివాస్ అధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని, సమస్యలు వస్తే తల్లిదండ్రులు, ఆధ్యాపకులతో చర్చించాలన్నారు. పోలీస్ విభాగం నుంచి మద్దిలేటి సైబర్ క్రైం, బాల్యవివాహాలు, రిలేషన్‌షిప్ అంశాలలో మోసపోకుండా ఉండాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, జే.హేమంత్, డా.నాగన్న, డా.ఫక్రున్నీసా బేగం, డా. వింధ్యావాసిని దేవి, డా. సోమశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి

బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి



జాతీయ అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్/కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తానని ఆ సంఘం యువజన విభాగం జాతీయ అధ్యక్షుడు కరణం నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం మౌర్యఇన్‌లో ఆయనను జిల్లా బ్రాహ్మణ సంఘం నాయకులు సన్మానించారు. చెరుకు చెర్ల రఘురామయ్య, జూపూడి శ్రీనివాస్, అశ్వనీకుమార్, నాగేంద్రశర్మ, ఇస్కాల సురేష్ పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న బ్రాహ్మణ యువజన సంఘాలను ఏకతాటిపైకి తెస్తానన్నారు.

రైతులు పంటలను కాపాడుకోవాలి

కోడుమూరు రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయని రైతులు అప్రమత్తంగా ఉండి పంటలను కాపాడుకోవాని ఏవో రవిప్రకాష్‌గౌడ్ సూచించారు. మంగళవారం వెంకటగిరి, కోడుమూరు, వర్కూరు గ్రామాల్లో పంటలను పరిశీలించి సూచనలు ఇచ్చారు. వర్షం తగ్గాక శనగలో ఎకరాకు అరకేజీ చొప్పున కార్బనిజం లేదా మాంకోజెబ్ పిచికారీ చేయాలని, పత్తిలో ఎకరాకు కేజీ మోతాదులో 13-0-45 పిచికారీ చేయాలన్నారు. కందిలో గూడుపురుగు, పచ్చపురుగు నివారణకు ల్యాంబ్డాసైలోత్రిన్ లేదా ఇమామెక్టిన్‌బెంజోయేట్‌కు 19-19-19 కలిపి పిచికారీ చేయాలన్నారు. సీసీఐలో పత్తి విక్రయించే రైతులు రైతుసేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని కోరారు.



వర్కూరులో రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో

కంచి పీఠాధిపతిచే జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి

కర్నూలు కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను మంగళవారం కర్నూలులో ఆదిశంకరాచార్య కంచిమంఠం పీఠాధిపతివిజయేంద్ర సరస్వతి ఆవిష్కరించారు. పాతనగరం ఖండేరీ వీధిలో అనుబంధ క్షేత్రం శంకర మందిరానికి ఆయన విచ్చేసి పూజలు నిర్వహించారు. డిసెంబరు 13న గుంటూరు అమరావతి రోడ్డులోని హిందూ కాలేజ్ ఆఫ్ పార్మసీలో నిర్వహిస్తున్న పోస్టర్‌ను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్‌కే మనోహర్ రావు పీఠాధిపతితో ఆవిష్కరింపజేశారు. డాక్టర్ ఎన్ వేణుగోపాల్, హెచ్‌కే రాజశేఖర్‌రావు, కల్లే చంద్రశేఖర్ రావు, పి.సుందరరామ శర్మ, కె.రంగనాథ శర్మ, మామిళ్లపల్లి రాజేశ్ శర్మ పాల్గొన్నారు.

నాణ్యమైన మద్యాన్ని పరిశీలించుకోవాలి

● సురక్ష యాప్ పని తీరుపై ఎమ్మెల్యే దస్తగిరి తనిఖీ



విక్రయాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కర్నూలు/ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సురక్ష యాప్‌తో నాణ్యమైన మద్యాన్ని పరిశీలించాలని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సూచించారు. మంగళవారం కర్నూలు రూరల్ మండలంలో మద్యం దుకాణాల్లో సురక్షయాప్ పనితీరును స్వయంగా పరిశీలించారు. మద్యం విక్రయాలు, బిల్లింగ్ ప్రక్రియను, క్యూలో నిలుచున్న వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా దుకాణాలతీరు ఉండాలని నిర్వాహ కులకు సూచించారు. మాజీ సీఎం జగన్ హయాంలో మద్యం సరఫరాలో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ప్రైవేట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చేలా నిర్ణయాలు తీసుకోవంతో ప్రభుత్వానికి రూ.వేల కోట్ల నష్టం కలిగించారని తెలిపారు.

రైతుల సంక్షేమానికే మార్కెట్ కమిటీలు

● జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమానికి మార్కెట్ కమిటీలు ఉన్నాయని వారికి సరైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. మంగళవారం ఆయన ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్, సీసీఐ కొనుగోలు చేసే పత్తి జిన్నింగ్ పరిశ్రమను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా బసాపురం రహదారిలోని సులోచనమ్మ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పరిశ్రమను పరిశీలించి కొనుగోళ్లకు సంబంధించిన సౌకర్యాలపై ఆరా తీశారు. మార్కెట్ యార్డ్‌లో పత్తి ప్లాట్‌ఫాంపై రైతులతో మాట్లాడారు. గిట్టుబాటు ధర అందడం లేదని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ ద్వారా పత్తిని కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. విక్రయానికి వచ్చే రైతులు ఇబ్బందులు కలక్కుండా తాగునీరు వర్షం వస్తే తడవకుండా తార్పాళ్లను ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆయన వెంట మార్కెట్ యార్డ్ కార్యదర్శి గోవిందు, తాసీల్దార్ రమేష్, సహాయ కార్యదర్శి శాంతకుమార్ ఉన్నారు.


మార్కెట్ యార్డ్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

రైతు సమస్యలు పరిష్కరించండి


కలెక్టర్ సిరికి ధన్యవాదాలు తెలుపుతున్న తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అధిక వర్షాలతో సాగు చేసిన పంటలు దిగుబడి వచ్చినా వర్షాలు, తుఫాన్ దాటికి పూర్తిగా పంటలు కుళ్లిపోయి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, టీడీపీ రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి కోరారు. మంగళవారం మండల పరిధిలోని రాతనలో పర్యటించిన కలెక్టర్ డా. సిరిని కలిసి శాలువ కప్పి వినతి పత్రం అందజేశారు.

అన్న క్యాంటీన్ల పరిశీలన


ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటున్న కమిషనర్

ఆదోని టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అన్నా క్యాంటీన్‌ల నిర్వహణపై మున్సిపల్ కమిషనర్ కృష్ణ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి పనితీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నిర్వాహకులు ప్రజలకు అందజేస్తున్న టిఫిన్‌లు, భోజనం ఏ మేరకు రుచికరంగా ఉన్నాయని క్యాంటీన్‌లో ఇంకా ఏ మేరకు సౌకర్యాలను కల్పించాలని అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

మద్దతు ధర రూ. 10వేలు ప్రకటించాలి



ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అధిక వర్షాలతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని ప్రభుత్వమే క్వింటాలు కనీస మద్దతు ధర రూ. 10 వేలతో కొనుగోలు చేసి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2.27 లక్షల హెక్టార్లలో పత్తి పంట సాగు చేశారని అధిక వర్షాల వల్ల పూర్తిగా పత్తి పంట దెబ్బతింది అన్నారు. ఎకరాకు రూ. 40 వేలు పెట్టుబడి ఖర్చులు పెట్టారన్నారు. దీంతో పత్తి రైతులు ధర అందక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డ్ కార్యదర్శి గోవిందుకు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మల్లయ్య, రామన్న, లింగప్ప, హనుమంత్ రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు

రైతులు జాగ్రత్తలు పాటించాలి

మద్దికెర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మొంథా తుఫాన్ వల్ల వర్షాలు కురుస్తున్నాయనీ, రైతులు సాగు చేసిన పంటలకు జాగ్రత్తలు తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రాఘవేంద్ర, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మౌనిక, వ్యవసాయశాఖ అధికారి రవి అన్నారు. మంగళవారం మండలంలోని హంపా గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి, కంది పంటలను పరిశీలించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని అన్నారు. వర్షాల వల్ల పత్తి పంటలో నీరు నిల్వ ఉంటే బయటకు తరలించాలని తెలిపారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం విక్రయాలపై తనిఖీలు

ఆదోని, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం విక్రయాల ద్వారా ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదాలు పొంచి ఉన్న నేపథ్యంలో రాష్ట్ర టీడీపీ ఆదేశాల మేరకు ఆదోని పట్టణంలో రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, టీడీపీ సీనియర్ నేత ఉమాపతినాయుడు ఆధ్వర్యంలో అకస్మాత్తుగా వైన్ షాపులను తనిఖీ చేశారు. సోమవారం వైన్ షాపుల్లో ప్రత్యక్ష పరిశీలన కోసం టీడీపీ నాయకులు బృందం కొత్త బస్టాండు సమీపంలోని న్యూ దీప్తి వైన్స్‌తో పాటు మనీషా వైన్ షాపులను సందర్శించింది. వినియోగదారులు తప్పనిసరిగా క్యూ ఆర్ ధ్రువీకరణ ద్వారా మాత్రమే మద్యం కొనుగోలు చేయాలన్నారు. రంగస్వామిగౌడ్, శంకర్, మండలాధ్యక్షులు శివప్ప, లక్‌ిన్న, ఈరన్న, రంగన్న, దస్తగిరి, వెంకన్న, ఐసీ రామకృష్ణ, వలి, వీరేష్, ఉరుకుంద, వెంకన్న, భగవాన్‌సింగ్, బాలు పాల్గొన్నారు.

ప్రైవేటీకరిస్తే ఉద్యమిస్తాం


సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న కంగాటి శ్రీదేవి

పత్తికొండ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తే ఉద్యమిస్తామని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హెచ్చరించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పత్తికొండలోని యశోద టవర్స్ కాలనీలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రారంభించారు. శ్రీరంగడు, సోమశేఖర్, ఎంపీపీ నారాయణదాస్, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజుయాదవ్, రామచంద్ర, క్రాంతికుమార్, సుంకన్న పాల్గొన్నారు.

తుగ్గలి: ప్రభుత్వం నిర్వహించే మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం సబబు కాదని, దీన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాలు సేకరిస్తున్నామనీ వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టా నగేష్ యాదవ్, జడ్పీటీసీ పులికొండ నాయక్, మాజీ జడ్పీటీసీ సభ్యులు నారాయణ నాయక్ అన్నారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జిట్టా లక్ష్మీదేవి, సర్పంచులు వరలక్ష్మి, లక్ష్మీదేవి, వెంకటేశ్ నాయక్ తదితరులు ఉన్నారు.

మండల కమిటీల ఎన్నికపై సమావేశం

● టీడీపీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి

ఆలూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గ పరిధిలోని టీడీపీ మండల నూతన కమిటీలపై బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు టీడీపీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన దర్మవరం సుబ్బారెడ్డి, ఆలూరు పరిశీలకులు అబ్బర్వర్ గంజి నాగరాజు హాజరవుతారన్నారు. కార్యక్రమానికి ఆరు మండలాల కన్వీనర్లు, టీడీపీ పార్టీ సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు, పార్టీ ఎంపీటీసీలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, తెలుగు యువత, టీఎన్‌ఎస్‌ఎఫ్, ఐటీడీపీ వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఎండీ వెంకట మాధవ్

మద్దికెర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మద్దికెర గ్రామంలోని శ్రీ విద్యాసాయి కళాశాల, పాఠశాలలో చదువుకునే విద్యార్థులు జిల్లా స్థాయి కబడ్డీ, ఖో-ఖో పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం శ్రీ విద్యాసాయి కళాశాలలలో ఎంపికైన విద్యార్థులను కళాశాల ఎండీ యజ్ఞం వెంకట మాధవ్ అభినందించారు. ఈ నెల 27వ తేదీన తాలుకా స్థాయిలో జరిగిన కబడ్డీ, ఖో-ఖో పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికయ్యారన్నారు. అండర్-14 ఖో-ఖోలో ఇ.శృతి, అండర్-17 ఖో-ఖోలో సాయిలక్ష్మి శ్రీ, అండర్-17, 14 కబడ్డీ పోటీల్లో అరవింద్, అమృత, సహస్ర ఎంపికయ్యారని అన్నారు. ఇదే పాఠశాలలో చదువుకుంటున్న మహీధర్, వై.నీరజ్, అండర్-14 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా చాలా ముఖ్యమన్నారు. ప్రిన్సిపాల్ బాల సునీత, పీఈటీ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

'పవర్ గ్రిడ్' కోసం భూముల పరిశీలన


భూములను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్

ఆలూరు రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మనేకుర్తి గ్రామంలో పవర్ గ్రిడ్ కోసం సేకరిస్తున్న భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ పరిశీలించారు. మంగళవారం భూముల పరిశీలన కోసం వచ్చిన జాయింట్ కలెక్టర్ కు రెండు పంటలు పండించే సాగు భూములను ఇచ్చే ప్రసక్తేలేదని మనేకుర్తి గ్రామ రైతులు మొరపెట్టుకున్నారు. సాగుకు పనికిరాని చౌడు భూముల్లో పవర్‌గ్రిడ్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు హనుమంతు, నారాయణస్వామి, రైతులు నాగరాజు కోరారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు ఇతర భూములను కూడా పరిశీలన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శోభాసువర్ణమ్మ, ఏఓ వెంకటేశ్వరగౌడ్, మండల సర్వేయర్ అరుణజ్యోతి, వీఆర్వో ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను పకడ్బందీగా చేపట్టండి

ఆస్పరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని చిన్న హోతూరు గ్రామంలో రీ సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రీ సర్వే ఎంతవరకు పూర్తి అయ్యిందో తదితర వివరలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతుల నుంచి ఏ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. రీ సర్వే చేపట్టాలని రైతులు లేవనెత్తిన ప్రతి భూ సమస్యను విచారించి పరిష్కరించాలన్నారు. ప్రజలు రీ సర్వేకు సహకరించాలన్నారు. జేసీ వెంట తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి, భీమేష్, విజయ్‌కుమార్ ఉన్నారు.

సమస్యలపై సమరశీల పోరాటాలు

● నవంబరు 10న కర్నూలుకు బస్సు జాతా రాక
● ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న

పత్తికొండ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పాలకులు అవలంభిస్తున్న విధానాల వల్ల ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యమయ్యిందని, ప్రభుత్వ విద్యను రక్షించుకునేందుకు, విద్యారంగ సమస్యల పరిష్కారానికై సమరశీల పోరాటాలు సాగిద్దామని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మోడల్ పాఠశాలలో కళాశాల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. విద్యారంగ పరిరక్షణకై ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బస్సు జాతా నవంబర్ 10న కర్నూలు నగరానికి బస్సు జాతా చేరుకుంటుందన్నారు. ఈ బస్సు జాతాను విద్యార్థులందరూ కదలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు శివ, విక్రమ్, రంగస్వామిలు పాల్గొన్నారు.

'భూ సమస్యలు పరిష్కరిస్తాం'

మద్దికెర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతుల భూ సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ గూండాల్ నాయక్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఎడవలి, ఎం.అగ్రహారం గ్రామాల్లో భూసమస్యలపై దరఖాస్తు చేసుకున్న రైతుల సమస్యలను పరిష్కరించడానికి వెళ్లారు. అలాగే రీసర్వేను పరిశీలించారు. వీఆర్వో స్వర్ణలత, రైతులు తదితరులు ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ, రైతు సంఘాల నాయకులు

పత్తికొండ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి కారుమంచి, రైతు సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సురేంద్రకుమార్‌లు జిల్లా కలెక్టర్ ఎ.సిరికి వినతి పత్రం అందించి కోరారు. మంగళవారం పత్తికొండ పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్‌కు సీపీఐ, రైతు సంఘాల ప్రతినిధి బృందం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో విస్తారంగా పంటలు రైతులను సాగు చేశారని, అయితే రైతులు సాగుచేసిన పంటలన్నీ అకాల వర్షాలకు దెబ్బతిని తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. రామాంజనేయులు, వీరన్న, కాశీ, రంగన్న, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు బకాయిలు చెల్లించాలి

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మూత పడ్డ రాయలసీమ స్పిన్నింగ్ మిల్లు కార్మికు లకు బకాయిలను తక్షణమే చెల్లి ంచాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకప్ప, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. మంగళవారం రెండో రోజు స్పిన్నింగ్ మిల్ కార్మికులు రిలే దీక్షలు చేప ట్టారు. మణి, అఖండ, సౌరప్ప, కుమారు, లింగన్న, మల్లికార్జున, ఖాదర్ పాల్గొన్నారు.

మంత్రి నిమ్మలతో టీడీపీ నేతల భేటీ


మంత్రి నిమ్మల రామానాయుడిని కలిసిన టీడీపీ సీనియర్ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ, బీజేపీ నాయకులు మధు

ఆదోని, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆదోని నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి అంశాలపై చర్చించేందుకు టీడీపీ సీనియర్ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ, బీజేపీ నాయకులు మధు రాష్ట్ర సచివాలయంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని మర్యాదపూర్వకంగా కలిసి ఆదోని అభివృద్ధిపై మాట్లాడారు. ఈ సందర్భంగా గుడిసె కృష్ణమ్మ నియోజకవర్గంలో చేపట్టాల్సిన ముఖ్యమైన అభివృద్ధి పనుల గురించి, ముఖ్యంగా జలవనరులు, సాగునీరు, తాగునీటి సమస్యలు పరిష్కరించడంపై ప్రధానంగా చర్చించారు. మంత్రి నిమ్మల రామానాయుడు స్పందించి ఆదోని అభివృద్ధికి ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి తమశాఖ తరఫున తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత


ప్రసంగిస్తున్న ఇస్కాన్ ధర్మ ప్రచారకులు కీర్తిరాజదాస్‌స్వామి

ఆలూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఇస్కాన్ ధర్మ ప్రచారకులు కీర్తిరాజదాస్‌స్వామి అన్నారు. మంగళవారం సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ధార్మిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భక్తి మార్గంతోనే జీవితానికి ధన్యత చేకూరుతుందన్నారు. భాగవతంలోని కార్తీక దామోదర లీలపై ప్రవచించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ మూడు రోజులపాటు ధార్మిక ప్రవచన కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి జి.నివాసులురెడ్డి, వై.వీరభద్రగౌడ్, పి.రామాంజనేయరెడ్డి, ఓ.వీరభద్రగౌడ్, విశ్వహిందూ పరిషత్ మఠ మందిర ప్రముఖ్ భరత్ కుబేర, కమిటీ సభ్యులు బి.ఎర్రిస్వామి, జె.మల్లికార్జున, ఎస్.బి.నివాసులు, బి.సూర్యనారాయణ, బి.రఘునాథ్‌రెడ్డి, కె.లోకన్నగౌడ్, జె.సిద్ధలింగయ్యస్వామి, బి.మల్లికార్జున, ఎం.నాగేంద్రయ్య, అర్చకులు జె.ఎర్రిస్వామి, నాగభూషణంస్వామి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆరోపణలు మానుకోండి


రవియాదవ్

చిప్పగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల రద్దు అంశంపై ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి కూటమి ప్రభుత్వంపై అసత్య ఆరోపనలు చేయడం తగదని టీడీపీ జిల్లా సోషల్ మీడియా మాజీ అధ్యక్షులు నేమకల్ రవియాదవ్ అన్నారు. ఎమ్మెల్యే విరుపాక్షి ఉనికి కోసం విమర్శలు చేయడం సరి కాదన్నారు. ఆలూరు సమస్యలపై అసెంబ్లీకి వెళ్లి మాట్లాడాలన్నారు. గతంలో మీరు చిప్పగిరి జెడ్పీటీసీగా ఉండి ఏమి చేశారని ప్రశ్నించారు. కనీసం నగరడోన రిజర్వాయర్‌ను కూడా పూర్తి చేయలేదని ఆరోపించారు. ఇలాంటి అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు.

నిత్యావసరాల అందజేత

ఆదోని టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పొలిమేరలలోని జీవనజ్యోతి వృద్ధాశ్రమానికి లయన్స్ క్లబ్ సభ్యులు మంగళవారం నిత్యావసరాలను అందజేశారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి అవసరమైన వారికి నిత్యావసరాలను అందజేస్తున్నామని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డా. గోపీనాథ్ అన్నారు. వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్న ఆశ్రమానికి నిత్యావసరాల అవసరం గుర్తించి వీటిని అందజేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ లు డా. గోపీనాథ్, ప్రసాదరావు, అధ్యక్షులు ధర్మారెడ్డి, ఆశ్రమ నిర్వాహకుడు ఫిలిప్స్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

పత్తికొండ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కర్నూలు నగరంలో ఈనెల 13న జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఆదర్శ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి శివకృష్ణ అండర్-19 బాలుర విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. అలాగే యోగా విభాగంలో ఇంటర్మీడియెట్ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని షబానా ఉత్తమ ప్రతిభ కనబరిచింది. అండర్-19 విభాగంలో క్యారమ్స్‌లో ఇంటర్మీడియెట్ సెకండియర్ చదువుతున్న సాయిసిద్ధార్థ ప్రతిభ చాటాడు. పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల వైస్ ప్రిన్సిపల్ రేష్మకౌసర్, పీడీలు రాజశేఖర్, నాయక్‌లు విద్యార్థులను అభినందించారు.

ఎంపీడీవోగా పదోన్నతి

ఆదోని రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆదోని డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న జనార్దన్‌కు ప్రభుత్వం ఎంపీడీఓగా పదోన్నతి కల్పించింది. మంగళవారంపంచాయతీరాజ్ కమీషనర్ కార్యాలయం జనార్ధన్‌ను పశ్చిమ గోదావరి జిల్లాకు అలాట్ చేస్తూ, ఉత్తర్వులు జారీ చేసింది. ఆదోనిఎంపీడీవో శేఖర్ ఎమ్మెల్యే పీఏగా వెళ్లడంతో గత ఆరునెలల పైబడి డిప్యూటీ ఎంపీడీఓగా ఉన్న జనార్దన్ ఇన్‌చార్జి ఎండీవోగా విధులు నిర్వహిస్తున్నారు. జనార్దన్‌కు ప్రమోషన్ రావడంతో ఏఓ నాగరాజు, సీనియర్ అసిస్టెంట్ వీరభద్రయ్య స్వామి, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, సురేష్, మంజు, మల్లికార్జున, తదితరులు అభినందనలు తెలపడంతోపాటు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఎన్నో ఏళ్లుగా పదోన్నతి కోసం నిరీక్షించిన తమకు కూటమి ప్రభుత్వం ఊతమిచ్చిందని జనార్ధన్ తెలిపారు.

ఆఖరి మజిలీకి అవస్థలు

మద్దికెర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిఇలోని ఎం.అగ్రహారం గ్రామంలో ఎవరైనా మనిషి మరణిస్తే వారి అంత్యక్రియలకు వెళ్లాలంటే బురదలోనే వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. వివరాలివీ.. మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో దాదాపు 8వేల జనాభా నివసిస్తున్నారు. ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలకు గ్రామ శివారులో హిందూ శ్మశాన వాటికను పూర్వం ఏర్పాటు చేశారు. అయితే శ్మశాన వాటికకు వెళ్లే రహదారి బురదమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం గ్రామంలో ఇద్దరు వ్యక్తులు మరణించారు. వీరి అంత్యక్రియలు చేసేందుకు శ్మశాన వాటిక వెళ్లే దారి బురద మయం, ముళ్ల కంపలతో మూసుకుపోవడంతో అవస్థలు పడుతూ అంత్యక్రియలు నిర్వహించారు. అధికా రులు పట్టించుకోకపోవడం వల్లే ఈ అవస్థలు అని వాపోయారు. పలుమార్లు పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ రహదారికి మట్టి రోడ్డు అయినా వేయాలన్నారు.


అంత్యక్రియలకు బురదలో మృతదేహాన్ని తీసుకెళ్తున్న గ్రామస్థులు

మెడికల్ కళాశాలలను కాపాడాలి: ఎమ్మెల్యే



కోటి సంతకాల సేకరణ పత్రాలను చూపిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మంత్రాలయం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవడం అందరి బాధ్యతగా గుర్తించుకోవాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మంటపంలో మెడికల్ కళాశాలల విధానాన్ని నిరసిస్తూ కోటి సంతకాల సేకరణను వైసీపీ మండల అధ్యక్షుడు గురెడ్డి భీమిరెడ్డి, సీవీ విశ్వనాథరెడ్డి, దశరథరెడ్డి, మంత్రాలయం సర్పంచు తెల్లబండ్ల భీమయ్య కరణంగురురాజరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో నాయకులు కరణం గోపిస్వామి, జెట్టివీరేష్, మేకల నారాయణ, మజ్జిగ రోగప్ప, సర్పంచు లింగారెడ్డి, ఆడిట్ శంకర్, జంగం వీరన్నస్వామి, వైస్ఎంపీపీ రాఘవేంద్ర, జక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే సహించం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే సహించేదిలేదని, దీంతో కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య హెచ్చరించారు. మంగళవారం ఎమ్మిగనూరులోని సీపీఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వం 60శాతం నిధులతో రాష్ట్రంలోని 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసిందన్నారు. అందులో 5 కళాశాలలు ప్రారంభమయ్యాయన్నారు. మరో రెండు కళాశాలలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. అలాగే మరో 10 కళాశాలలు 30 నుంచి 70శాతం పనులు పూర్తయ్యాయన్నారు. అలాంటి క ళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలి చూడడం దారుణం అన్నారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, శ్రీనివాసులు, శ్రీరాములు, రాజీవ్, వీరేష్, విజయేంద్ర, నరసింహులు పాల్గొన్నారు.

ప్రతి కాలనీకి రోడ్లు : ఎంపీడీవో పుల్లయ్య

నందవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి కాలనీకి రోడ్లు వేస్తామని ఎంపీడీవో పుల్లయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని ముగతి గ్రామంలో రోడ్లను ఎంపీడీవో, అదనపు ఎంపీడీవో సందీప్ పరిశీలించారు. రోడ్లు వేసేందకు ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు తయారు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో తడి, చెత్త, పొడి చెత్త వాహనమిత్రులు ఇంటింటికి తిరుగుతన్నారా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ నరసింహులు, ఎఫ్ఏ కడుబూరి పాల్గొన్నారు.

టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ మృతి



చెన్నారెడ్డి (ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కడిమెట్ల చెన్నారెడ్డి (59) మంగళవారం తెల్లవారు జామున అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు భాస్కర్ల చంద్రశేఖర్, మండల కన్వీనర్ కె.టి వెంకటేశ్వర్లు, కాపు మురళికృష్ణారెడ్డిలతో పాటు మండల నాయకులు చెన్నారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పార్టీ వారి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు కేశన్న, దేవదాసు, సోగనూరు జగదీష్, అయ్యాళప్ప, ప్రజలు పాల్గొన్నారు.

చాపవంక సమస్యకు పరిష్కారం చూపుతాం



చాపవంకను పరిశీలిస్తున్న సీఐ, తహసీల్దార్, ఎంపీడీవో

కోసిగి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో ఉన్న చాపవంకకు వానొస్తే వాగు పొంగి పొర్లుతూ రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. మంగళవారం ఆంధ్రజ్యోతిలో కోసిగిలో దంచి కొట్టిన వాన.. ఉధృతంగా ప్రవహించిన చాపవంక.. ఇబ్బందులు పడిన ప్రయాణికులు అనే కథనం ప్రచురితమైంది. మంగళవారం చాపవంకను తహసీల్దార్ వేణుగోపాల్, సీఐ మంజునాథ్, ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి, ఎస్ఐ హనుమంతరెడ్డి కలిసి చాపవంకను, పరిసరాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ త్వరలోనే చాపవంక సమస్యను పరిష్కారించి కృషి చేసేలా అలాగే రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు మొ దలు పెట్టేలా చూస్తామని తెలిపారు. అలాగే ఆంధ్రజ్యోతితో మంత్రాల యం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి ఫోన్‌లో మాట్లాడుతూ త్వరలోనే చాపవంక రోడ్డును యుద్ధ ప్రాతిపదికన పనులు చేసి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు.

విద్యుత్ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మిగనూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ వల్ల ఏర్పడే విద్యుత్ అంతరాయాలను అధికమించడానికి విద్యుత్ ఉద్యోగులు సన్నదంగా ఉండాలని ఏపీ డీపీసీఎల్ ఎస్పీ ప్రదీప్‌కుమార్ కోరారు. మంగళవారం పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లా నుంచి 262 మంది విద్యుత్ అధికారులు, సిబ్బంది విశాఖపట్నం, కాకినాడ ప్రాంతాలకు అత్యవసర విధుల నిర్వహణకు వెళ్లారని ఆయన తెలిపారు. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాలలో విద్యుత్ అంతరాయాలను అధిగమించడానికి గాను కంట్రోల్ రూములను ఏర్పాటు చేశామన్నారు. అందులో భాగంగా ఎమ్మిగనూరు కు సంబంధించి విద్యుత్ అంతరాయాల కోసం విద్యుత్ సమస్యల కోసం 7396420036 నెంబర్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మంత్రాలయం ఏడీఏ శాంతిస్వరూప్, పట్టణ ఏఈ ప్రసన్నఆంజనేయులు పాల్గొన్నారు.

మొంథా అలజడి

- రోజంతా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- చేతికొచ్చిన పంటలన్నీ నాశనం
- తీవ్రంగా నష్టపోయిన రైతులు



గోనెగండ్ల మండలంలో రోడ్లపై వర్షపు నీరు

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి మంగళవారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో పనులపై బయటకు వెళ్లిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోజంతా వర్షం కురవడంతో చిరు వ్యాపారులు అవస్థలు పడ్డారు. చేతికొచ్చిన పంటలన్నీ నీటిపాలు కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

రోడ్డు జలమయం

గోనెగండ్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో కురుస్తున్న వర్షాల కారణంగా హెచ్ కైరవాడి, పెద్దనేలటూరు రోడ్డు జలమయమైంది. సీసీరోడ్డు, డ్రైనేజీ లేని కారణంగా మురుగునీరు, వర్షపునీరు రోడ్డుపైనే నిలిచిపోయింది. మండలంలో సాగు చేసిన పంటలన్నీ నీట మునిగాయి.

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని స్థానిక గాంధీనగర్ నందు మొంథా తుపాన్ నేపథ్యంలో డ్రైన్ పనులను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. మంగళవారం వారు మాట్లాడుతూ మొంథా తుఫాన్ నేపధ్యంలో వర్షా ప్రభావం ఎక్కువ ఉండడం వలన నీరు నిలిచి రోడ్లపైకి రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డ్రైన్‌లలో పూడిక తీత పనులు పరిశీలించి మున్సిపల్ కార్మికులకు దిశానిర్దేశం చేశారు.

పెద్దకడబూరు: మొంథా తుఫాను కారణంగా ప్రజలు సురక్షతమైన గృహలలోనే ఉండాలని ఎస్ఐ నిరంజన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో మొంథా తుఫాను కారణంగా ప్రజలను పోలీసులు మైకుల ద్వారా ప్రజలను అప్రమత్తం చేశారు. ఆయన మాట్లాడుతూ పాడుపడ్డ ఇళ్లలోని కాకుండా సురక్షతంగా ఉండాలన్నారు.

నీట మునిగిన పంటలు

మంత్రాలయం: మంత్రాలయం నియోజకవర్గంలో కౌతాళం, కోసిగి, మంత్రాలయం మండలాల్లో కురిసిన వర్షాలకు రైతన్నలకు అపార నష్టం వాటిల్లింది. మూడు రోజులుగా తుంగభద్ర నదీతీర గ్రామాల్లో కురిసిన వర్షానికి పత్తి, జొన్న, వరి, మిరప పంటలన్నీ దెబ్బతిన్నాయి. చేతికందుతున్న తరుణంలో పత్తిపంట వర్షానికి తడిసి నేలపాలు కావడమేకాక చెట్టునుంచే విత్తనం మొలకెత్తాయి. మంత్రాలయం మండలంలోని రాంపురం, తుంగభద్ర, కాచాపురం, కాగ్గల్లు, నారాయణపురం, దిబ్బనదొడ్డి, బసాపురం, కౌతాళం మండలంలోని నదిచాగి, కుంబళూరు, వళ్లూరు, గుడికంబాల, కోసిగి మండలంలోని తుమ్మిగనూరు, అగసనూరు, సాతునూరు, కందుకూరు గ్రామాల్లో వరి, పత్తిపంటలు నేలకొరిగాయి.

కోసిగి: మండలంలో సాతనూరు, తుమ్మిగనూరు, అగసనూరు, కందుకూరు, కడిదొడ్డి గ్రామాల్లో వేల ఎకరాల్లో వరి పైరు నేలవాలింది. నష్టపోయిన వరి రైతులకు ప్రభుత్వమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.



సాతనూరులో నేలకొరిగిన వరి పంట



మంత్రాలయంలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

నేటి నుంచి సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు



మాట్లాడుతున్న చైర్మన్ మల్లయ్య, కార్యదర్శి చంద్రమౌళి

ఎమ్మిగనూరు,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో బుధవారం సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు ప్రారంభిస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ కురువ మల్లయ్య, మార్కెట్ కమిటీ ప్రత్యేకశ్రేణి కార్యాదర్శి చంద్రమౌళి తెలిపారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్ కమిటీలో వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేసేందుకు 30 కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఎమ్మిగనూరులో మురారి జిన్నింగ్,ప్రెస్సింగ్, శివ జిన్నింగ్,ప్రెస్సింగ్, మహాలక్ష్మి కాటన్ ట్రేడర్స్, మాదవా కాటన్స్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. సీసీఐలో పత్తిని విక్రయించే రైతులు ముందుగా రైతు సేవా కేంద్రాల్లో తమ వివరాలను సీఎం యాప్‌లో వీఏఏ ద్వారా నమోదు చేసుకున్న తరువాత కపాస్ కిసాన్ యాప్‌లో వీఏఏ ద్వారా ఏరోజు అమ్ముకో వాలో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. స్లాట్ ప్రకారం సీసీఐ నిర్ధేశించిన నాణ్యతప్రమాణాలకు లోబడి యాప్‌లో సూచించబడిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పత్తికి క్వింటాలుకు రూ. 8110లు కనీస మద్దతు ధర అందించేందుకు సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగిందని పత్తి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చే సుకోవాలని కోరారు.

కోసిగి: కోసిగి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో సీసీఐ ద్వారా 30 నుంచి పత్తి కొనుగోలు చేస్తున్నట్లు మంత్రాలయం మార్కెట్‌యార్డు చైర్మన్ చింతలగేని నర్సారెడ్డి, మార్కెట్ యార్డు కార్యదర్శి ఆకుల రవికుమార్, సూపర్‌వైజర్ రాఘవేంద్ర తెలిపారు. మంగళవారం నర్సారెడ్డి మాట్లాడుతూ సీసీఐ తేమ శాతం తక్కువగా ఉన్న పత్తిని క్వింటం రూ.8,060లకు కొనుగోలు చేస్తారనీ, అంతకుముందు రైతులు రైతు సేవా కేంద్రాల్లో ఈక్రాప్, సీఎం యాప్ ద్వారా రైతు సేవా కేంద్రాల్లో అధికారులను సంప్రదించి కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. అలాగే మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్ర ఆగ్రో ఇండస్ట్రీస్ వద్ద ఉన్నటువంటి సీసీఐ వారిని సంప్రదించి రైతులు స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. మంత్రాలయం నియోజకవర్గం పరిధిలో కోసిగి, కౌతాళం, పెద్దకడుబూరు, మంత్రాలయం మండలాల రైతులు కోసిగి మార్కెట్ యార్డు పరిధిలో ఉన్నటువంటి శ్రీరాఘవేంద్ర ఆగ్రో ఇండస్ట్రీస్ మంత్రాలయంలో పత్తిని విక్రయించవచ్చని తెలిపారు.

మహాయాగం ఏర్పాట్లను పరిశీలించిన సీఐ



స్వరూపానంద స్వామిజీతో వివరాలు తెలుసుకుంటున్న సీఐ శ్రీనివాసులు

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మిగనూరు పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో ఈనెల 31నుంచి నవంబర్ 14 వరకు జరిగే 87వ విశ్వశాంతి మహాయాగం ఏర్పాట్లను మంగళవారం పట్టణ సీఐ శ్రీనివాసులు పరిశీలించారు. మైదానంలో మహాయాగం ఏర్పాట్లు చేస్తున్న శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీతో సీఐ మాట్లాడి మహాయాగం ఎన్నిరోజుల నిర్వహిస్తారు, ఎంత మంది భక్తులు పాల్గొంటారు అన్న వివరాలు తెలుసుకున్నారు. స్వామీజీ మాట్లాడుతూ 15 రోజుల పాటు జరిగే మహాయాగంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సీఐని కోరారు. కార్యక్రమంలో తొగటనరసింహులు, వెంకటగిరి, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

మంత్రాలయం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కల్పిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం మంత్రాలయం పోలీసుస్టేషన్‌లో అయా గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గురువారం, శని,ఆదివారాల్లో ట్రాఫిక్‌కు ఆటోలు వల్ల తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో అంజి, మల్లికార్జునస్వామి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంచాలమ్మకు సుగంధ ద్రవ్యాలతో విశేషాభిషేకం



మంచాలమ్మను సుందరంగా అలంకరించిన దృశ్యం

మంత్రాలయం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు సుగంధ ద్రవ్యాలతో విశేషాభిషేకం నిర్వహించారు. మంగళవారం కార్తీక శుద్ధ షష్ఠి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మలవిసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, సుగంధ ద్రవ్యాలతో విశేష పంచామృతాభిషేకం చేసి పసుపు, గంధం, పట్టుచీర, బంగారు, వెండి ఆభరణాలతో పాటు వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మంచాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

రజిత గజవాహనంపై విహరించిన ప్రహ్లాదరాయలు

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజిత గజవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్తీక శుద్ధ షష్ఠిని పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణాలు, మంగళ వాయిద్యాల మధ్య రజిత గజవాహనంపై స్వర్ణ అంబారిలో ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.

గుంతల రోడ్డుకు మోక్షం



గుంతల రోడ్డుకు మరమ్మతులు చేపట్టిన దృశ్యం

కోసిగి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు రోడ్డు నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో రోడ్లు ఇలా.. వెళ్లేదెలా.. అనే శీర్షిక ప్రచురితమైంది. మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు ఆర్అండ్‌బీ డీఈ నాగరాజు, నరేష్‌లు మంగళవారం గుంతల రోడ్లపై సిమెంటు, కంకర, జేసీబీతో పనులు చేపట్టారు. ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి గుంతల రోడ్ల పనులు పరిశీలించారు.

డివిజన్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మంత్రాలయం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ట్టణ ప్రాంతాల్లో చదువతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత అవసరమని క్రీడల్లో గెలుపు ఓటములు సాధారణమని, క్రీడా స్ఫూర్తితో ఆడాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పి.తాండ విద్యానగర్ ఎస్ఎంకేవీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2025-26 విద్యా ఏడాదికి డివిజినల్ స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలను ఆదోని డివిజన్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కవిరాజు, ఎంఈఓ మైనుద్దీన్, పీడీలు ఖలీల్, హెచ్ఎం రామాంజనేయులు, లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి రిబ్బన్‌కట్‌చేసి కబడ్డీ ఆడి ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ గుర్రెడ్డి భీమిరెడ్డి, వ్యవసాయ సలహామండలి మాజీ అధ్యక్షులు సీవీ విశ్వనాథ్‌రెడ్డి, దశరథరెడ్డి, బాలయ్య, నరసింహరాజు, నరసింహులు, రామన్న, సురాజ్, శ్రీనివాసులు, శ్రీరామ్, చెన్నబసవ, శేషు, గంగాధర్, అనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ సెలూన్ షాపులో అగ్నిప్రమాదం

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శివ సర్కిల్‌లో బెస్ట్ కట్స్ మేన్స్ సెలూన్ షాపులో అర్ధరాత్రి ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సోమవారం సాయంత్రం యజమాని గోవిందు సెలూన్ షాపులో పూజా చేసి దీపారాధన పెట్టి బంద్ చేశాడు. అయితే ప్రమాదవశాత్తు మంటలు చేలరేగి అగ్ని ప్రమాదం సంభవించడంతో షాపు నుండి పొగలు వస్తుండడం చూసిన స్థానికులు యజమానికి ఫోన్ చేయగా హుటాహుటిన షాపు లెరచి స్థానికుల సహాయంతో మంటలను అదుపు చేశారు. ఈ అగ్ని ప్రమాదంలో ఫర్నిచర్ వస్తువులు కాలిపోయాయి. దాదాపు రూ లక్ష ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం



పోస్టర్లను విడుదల ఏఐఎస్ఎఫ్ నాయకులు

మంత్రాలయం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయకార్యదర్శి థామస్ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వచ్చే నెల10న కర్నూల్‌లో జరిగే బస్సుయాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజురీయంబర్స్‌మెంట్ రూ. 6,400కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీఓ నెం.77ను రద్దుచేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకలు అరుణాచారి, వీరేష్, నవీన్, రాజు, దివాకర్, మహేంద్రలు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న బస్సు జాతాను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా, ఖాదర్, సమీర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాల ముందు బస్సుయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబరు 22 నుంచి నవంబరు 12వ తేదీ వరకు జరిగే బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో దస్తగిరి, హాజీ, వీరేష్, అనీఫ్, మనికంఠ, షేక్షావలి పాల్గొన్నారు.

అనుమతి లేకుండా క్రయ విక్రయాలపై విచారణ

ఎమ్మిగనూరు,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటిలో అనుమతి లేకుండా అక్రమంగా వ్యాపారం సాగిస్తున్న వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని మార్కెట్ కమిటీ చైర్మన్ కురువ మల్లయ్య తెలిపారు. మార్కెట్‌లో ఓ వ్యాపారి లైసెన్సు లేకుండా నిర్వహిస్తున్న వ్యాపారంపై జరుగుతున్న నయాదందా అన్న శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. ఇందుకు స్పందించిన చైర్మన్ మల్లయ్య మాట్లాడుతూ అనుమతులు లేకుండా క్రయవిక్రయాలు చేస్తున్న వ్యాపారిపై విచారణ చేయాలని మార్కెట్ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఎవరికి ఇబ్బంది లేకుండా నిబంధనలమేరకు మార్కెట్‌లో క్రయవిక్రయాలు చేసుకోవాలని, లేని పక్షంలో తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్డీఎస్ ఆనకట్టకు పోటెత్తిన వరద



కోసిగి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో కోసిగి మండల పరిధిలోని అగసనూరు సమీపంలో ఉన్న తుంగభద్ర నదికి వరద నీరు పోటెత్తింది. ఆర్డీఎస్ ఆనకట్ట మీద సుమారు 5 అడుగుల మేర వరద నీరు దిగువకు పోటెత్తింది. కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంతరెడ్డి మంగళవారం ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద వరద ఉధృతిని పరిశీలించి సాతనూరు, తుమ్మిగనూరు గ్రామాల ప్రజలకు మొంథా తుఫాన్ పై అవగాహన కల్పించారు. ఎవరూ కూడా తుంగభద్ర నదిలోకి వెళ్లరాదని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దన్నారు. అయితే.. ఎగువ కర్ణాటక రాష్ట్రంతో పాటు పశ్చిమాన కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర నదికి వరద నీరు పోటెత్తింది. నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ మంజునాథ్, తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్ఐ హనుమంతరెడ్డి, ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి హెచ్చరికలు జారీ చేశారు.

రోడ్డుపైనే పత్తి వాహనాలు

నందవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నుంచి ముగతికి వెళ్లే మురహరి, నటరాజు పత్తి మిల్లులు ఉన్నాయి. మత్రాలయం, ఎమ్మిగనూరు నియోకజవర్గాల చెందిన రైతులు వాహనాల్లో మిల్లుల వద్దకు పత్తిని తీసుకొస్తారు. అయితే మిల్లల వద్ద ఆటోలను నిలిపేందుకు స్థలం లేకపోవడంతో వాహనాలను రోడ్డుకు అడ్డంగా కిలోమీటర్ పొడవునా నిలుపుతున్నారు. దీని వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. ఉదయం, సాయంత్రం అయితే విద్యార్థులు, ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనానికి ఈ రహదారి వెంటనే భక్తులు వెళ్తుంటారు. వాహనాలను గుర్తించక ఇటీవల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని పోలీసులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డుకు అడ్డంగా ఉండకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రహదారిపై నిలిచిన పత్తి వాహనాలు